# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 114 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం 14 జూన్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 114 14-06-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## ఏపీలో రైతులకు 80 శాతం రాయితీతో డ్రోన్లు

అమరావతి జూన్ 13 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



కేంద్రం ప్రవేశపెట్టిన నమో డ్రోన్ దీదీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోంది. 80% రాయితీతో మహిళా రైతులకు డ్రోన్లు అందిస్తోంది. లబ్ధిదారులను ఎంపిక చేసి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ వినియోగంపై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు 875యూనిట్లు మంజూరు చేశారు. యూనిట్ ధర రూ.10 లక్షలు కాగా రూ.8లక్షలు ప్రభుత్వమే భరిస్తోంది. డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగు మందుల పిచికారీ సులభమవుతోంది.

# బ్లాక్ బాక్స్ స్వాధీనం..

### ఘటనా స్థలంలో కీలకమైన బ్లాక్ బాక్స్ లభ్యం
### బ్లాక్ బాక్స్ డేటాను విశ్లేషిస్తే ప్రమాద కారణాలు తెలిసే అవకాశం
### 28 గంటల్లో బ్లాక్ బాక్స్ స్వాధీనం చేసుకున్నాం: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



న్యూఢిల్లీ జూన్ 13 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)


గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిన్న ఎయిర్ ఇండియా డ్రీమ్‌లైనర్ విమానం కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఇప్పుడా విమానం బ్లాక్ బాక్స్ లభ్యమైంది. దాంతో, ఈ విమాన ప్రమాదానికి గల కారణాలు ఏంటన్నది తెలిసే అవకాశం ఉంది. అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఈ విమానం టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 241 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. అయితే, అద్భుతరీతిలో ఒక ప్రయాణికుడు మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాద స్థలం నుంచి విమానానికి సంబంధించిన బ్లాక్ బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇద్దరు పోలీసు అధికారులు రాయిటర్స్ వార్తా సంస్థకు తెలిపారు. ప్రమాదానికి ముందు పైలట్లు "మేడే" కాల్ చేసినట్లు తెలుస్తోంది. అయితే, ఆ తర్వాత నిమిషాల వ్యవధిలోనే విమానం కూలిపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అసలు ప్రమాదానికి గల కారణాలు ఏమిటనే దానిపై తీవ్ర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఘటనా స్థలంలో లభ్యమైన బ్లాక్ బాక్స్ ద్వారా ప్రమాదానికి ముందు విమానంలో ఏం జరిగిందనే విషయాలు, పైలట్ల చివరి మాటలు, సాంకేతిక లోపాలు వంటి కీలక సమాచారం తెలిసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. బ్లాక్ బాక్స్ డేటా



- తరువాయి 2లో..

## ఇరాన్ -ఇజ్రాయెల్ మధ్య
# భీకర యుద్ధం

- మొదటి రోజు దాడుల్లోనే ఇరాన్ ఉన్నత సైనికాధికారులు,
- కీలక సైంటిస్టులను కడతేర్చిన ఇజ్రాయెల్
- ఇరాన్‌పై 'ఆపరేషన్ రైజింగ్ లయన్' చేపట్టిన ఇజ్రాయెల్
- అణు కేంద్రాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు
- ఇరాన్ ఆర్మీ చీఫ్ సహా పలువురు కీలక సైనికాధికారుల మృతి
- ఆరుగురు ప్రముఖ అణు శాస్త్రవేత్తలు కూడా హతం
- ఇరాన్, ఇజ్రాయెల్ గగనతలంపై విమాన సర్వీసుల దారి మళ్లింపు
- తీవ్ర పరిణామాలుంటాయని ఇరాన్ సుప్రీం లీడర్ హెచ్చరిక



మధ్యప్రాచ్యంలో ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్తతలు శుక్రవారం మరింత తీవ్రరూపం దాల్చాయి. ఇజ్రాయెల్ చేపట్టిన 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో జరిపిన భీకర దాడుల్లో ఇరాన్‌కు చెందిన పలువురు అత్యున్నత సైనికాధికారులు, కీలక అణు శాస్త్రవేత్తలు మరణించారు. ఈ



- తరువాయి 2లో..

## కోర్ ఏరియాలో రూ.1052 కోట్లతో సదుపాయాలు
### సిఆర్‌డిఏ సమావేశంలో నిర్ణయం



అమరావతి జూన్ 13 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అమరావతి రాజధాని పరిధిలో 1450 ఎకరాల్లో విస్తరించి ఉన్న ప్రభుత్వ భవనాల సముదాయం(కోర్ ఏరియా)లో సదుపాయాల కల్పనకు 1,052 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సిఆర్‌డిఎ సమావేశంలో ఈ పనులను వెంటనే టెండర్లు పిలవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సీడ్ యాక్సెస్ రోడ్డు విస్తరణపై చర్చ జరిగింది. పెనుమాక రెవెన్యూ పరిధిలో రైతులు భూములు ఇచ్చినందున వెంటనే పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. దీనికోసం రూ.622 కోట్లు కేటాయించారు. సీతానగరం నుండి జాతీయ రహదారి 16లో మణిపాల్ ఆస్పత్రి వరకూ నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌ను విస్తరించాలని నిర్ణయించారు. గతంలో సుందరయ్యనగర్ వరకూ నిర్మించి అక్కడ జాతీయ రహదారిలో కలిసే చోట సాధారణ జంక్షన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పుడు నేరుగా జాతీయ రహదారి వరకూ నిర్మించి అధునాతన పద్ధతిలో ట్రంపెట్ జంక్షన్ ఏర్పాటు చేయనున్నారు. దీనిపైనే ఎక్కువసేపు చర్చ జరిగినట్లు తెలిసింది. అలాగే ప్రస్తుతం ప్రభుత్వ

- తరువాయి 2లో..

## విజయ్ భాయ్ ఇక లేరంటే నమ్మలేకపోతున్నాను: ప్రధాని మోదీ

- గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించిన ప్రధాని నరేంద్ర మోదీ
- 'ప్రమాదంలో ప్రాణాలతో బయటపడ్డ ఏకైక వ్యక్తిని కూడా ఆసుపత్రిలో పరామర్శించిన ప్రధాని



గుజరాత్ జూన్ 13 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత విజయ్ రూపానీ అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మరణించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విజయ్ రూపానీ కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా రూపానీతో తనకున్న దశాబ్దాల అనుబంధాన్ని, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆయనకున్న నిబద్ధతను మోదీ గుర్తుచేసుకున్నారు. "విజయ్‌భాయ్ రూపానీ కుటుంబాన్ని

- తరువాయి 2లో..



## బ్యాంకులకు చేరిన 'తల్లికి వందనం' నిధులు

అమరావతి జూన్ 13 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తల్లికి వందనం నిధులు బ్యాంకులకు చేరినట్లు ప్రభుత్వం తెలిపింది. గురువారం అర్ధరాత్రి నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమకావడం ప్రారంభమవుతుందని పేర్కొంది. 35,44,459 మంది తల్లులు, సంరక్షకుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమకానున్నాయి. ఒక్కో విద్యార్థికి రూ.15వేల చొప్పున విడుదల చేసింది. ఇందులో రూ.13వేలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు, మిగతా రూ.2వేలను ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం కలెక్టర్ల ఖాతాలకు జమచేస్తారు.



## కొమ్మినేనికి సుప్రీంలో ఊరట లభించడంపై జగన్ స్పందన

- అమరావతి మహిళలపై వ్యాఖ్యల కేసులో కొమ్మినేనికి సుప్రీంకోర్టులో ఊరట
- సీనియర్ జర్నలిస్టును వెంటనే విడుదల చేయాలన్న సుప్రీం ఆదేశాలు
- ఇది చంద్రబాబు నిరంకుశత్వానికి చెంపపెట్టు అన్న వైఎస్ జగన్
- ప్రజల దృష్టి మరల్చేందుకే చంద్రబాబు కృత్రిమ వివాదం సృష్టించారని ఆరోపణ
- కొమ్మినేనికి సంబంధం లేని వ్యాఖ్యలు ఆపాదించారని జగన్ విమర్శ
- సుప్రీం తీర్పుతో చంద్రబాబు కుట్ర బట్టబయలైందని వ్యాఖ్య



అమరావతి జూన్ 13 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యల కేసులో సీనియర్ పాత్రికేయుడు, సాక్షి చానల్ న్యూస్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీంకోర్టులో ఊరట లభించడంపై వైసీపీ అధినేత జగన్ స్పందించారు. "సత్యమేవ జయతే" అంటూ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు గారిని వెంటనే విడుదల చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు చంద్రబాబు గారికి పెద్ద చెంపపెట్టు. నిరంకుశంగా, అప్రజాస్వామికంగా, అరాచకంగా వ్యవహరిస్తున్న చంద్రబాబుకు న్యాయస్థానం గట్టిగా బుద్ధిచెప్పింది. ప్రాథమిక హక్కులకు, స్వేచ్ఛకు ఈ అరెస్టు తీవ్ర భంగకరమని కోర్టు చెప్పడం ముదావహం. అమరావతి నిర్మాణం పేరిట వేల కోట్ల అవినీతి నుంచి, తన పాలనా వైఫల్యాల నుంచి, క్షీణించిన లా అండ్ ఆర్డర్ పరిస్థితులపై తీవ్రంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించడానికి తన ఎల్లో మీడియాతో కలిసి చంద్రబాబుగారు కృత్రిమ వివాదాన్ని సృష్టించారు. అబద్ధాలు, మోసాలతో కూడిన పాలననుంచి మళ్లించడానికి,

- తరువాయి 2లో..

### అమరావతి మహిళలను కించపరిచిన కేసులో
# కొమ్మినేనికి బెయిల్

### పత్రిక స్వేచ్ఛ, వ్యక్తిగత స్వతంత్రత కాపాడిన సుప్రీంకోర్టు వ్యాఖ్యలు
### ఎదుటివారి వ్యాఖ్యలపై నవ్వితే కేసా
### కించపరుస్తున్న వ్యాఖ్యాతను కొమ్మినేని ప్రోత్సహించారు
### ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తరపున లాయర్లు వాదన
### ఈ కేసులో మిగతా వారికి అరెస్టులు నుంచి మినహాయింపు లభిస్తుందా

అమరావతి జూన్ 13 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఏపీ రాజధాని అమరావతి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కేసులో సాక్షి యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్ అయి ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా ఉన్నారు. దీంతో ఆయన బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కింది కోర్టులో బెయిల్ కోసం కొమ్మినేని దరఖాస్తు చేసుకున్నారు. అయితే అక్కడ ఆయన బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన జస్టిస్ పీకే మిశ్రా ధర్మాసనం బెయిల్ మంజూరు చేస్తూ.. వెంటనే విడుదల చేయాలని ఆదేశాలిస్తూ.. మరోసారి అమరావతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేయవద్దని కొమ్మినేనికి

- తరువాయి 2లో..

## లై డిటెక్టర్ టెస్టుకు నేను సిద్ధం.. సీఎం రేవంత్ సిద్ధమేనా ? : కేటీఆర్



హైదరాబాద్ జూన్ 13 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఫార్ములా-ఈ కేసులో దర్యాప్తు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ సందర్భంగా తీవ్ర వ్యాఖ్యలతో ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "అబద్ధాలతో అధికారంలోకి వచ్చి, ప్రభుత్వాన్ని నడపడం చేతకాని జోకర్ ముఖ్యమంత్రి, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రతిరోజూ పూటకో వేషం వేస్తున్నాడు. పనికిరాని

- తరువాయి 2లో..

## సంపాదకీయం

# ఘోర ప్రమాదం!

%గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లో గురువారం మధ్యాహ్నం ఎయిరిండియా విమానం కుప్పకూలి, అందులోని ప్రయాణికులు, సిబ్బందిబీ కూలిన ప్రాంతంలో ఉన్న వైద్య విద్యార్థులూ దుర్మరణం చెందటం అత్యంత విషాదకరం! లండన్‌కు బయల్దేరిన ఈ విమానం రన్ వే నుంచి లేచిన కొద్ది నిమిషాల్లోనే ప్రమాదంలో చిక్కుకోవడం, సాయం కోసం పైలట్లు అత్యవసర కాల్ ఇవ్వడం, తరువాతి కొద్ది క్షణాల్లోనే జనావాసాలపై కూలిపోవడం జరిగిపోయింది! ఈ ఘోర ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజరు రూపానీ సహా వందల మంది దుర్మరణం చెందారు. రమేష్ బిశ్వాస్ అనే ప్రయాణికుడు ఒక్కరే ఈ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాద సమయంలో విమానంలో ఇద్దరు పైలట్లు, పది మంది సిబ్బంది సహా 242 మంది ఉన్నారు. విమానం జిజె వైద్య కళాశాల హాస్టల్‌పై కుప్పకూలటంతో– భవనం ధ్వంసమై ఐదుగురు మెడికల్ విద్యార్థులు మృతి చెందారు. 20 మంది దాకా గాయపడ్డారు. ఈ ఘోర ప్రమాదం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 2020లో కోజికోడ్ ఎయిర్‌పోర్టులో ల్యాండవుతూ భారీ వర్షం కారణంగా అదుపు తప్పి చోటు చేసుకున్న బోయింగ్ 737 ప్రమాదం తరువాత– మనదేశంలో ఇటీవల జరిగిన విమాన ప్రమాదాల్లో ఇదే పెద్దది.

ప్రభుత్వ రంగాన సాగాల్సిన ప్రజా రవాణా వ్యవస్థలు కార్పొరేటుపరం అయ్యాక– అవి లాభాలే ప్రధానంగా నడుస్తాయి. గతేడాది జూన్, డిసెంబరు నెలల్లో ఈ విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, వాటి పూర్తి నివారణ జరక్కపోవడమే ఈ ప్రమాదానికి కారణమై ఉండొచ్చని కొందరు సందేహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలి. సమస్యలు తలెత్తినా సరైన చర్యలు తీసుకోని నిర్లక్ష్యమే నిజమైతే అది క్షమించరాని నేరం అవుతుంది. విమాన ప్రమాదాల్లో ప్రాణనష్టం తీవ్రంగా ఉండటానికి %–% ఎత్తు నుంచి కూలిపోవడం కన్నా కూడా అది మంటల్లో కాలిపోవటమే ప్రధాన కారణం. విమానాల్లో వాడే ఇంధనం అత్యధిక దహన శక్తిని కలిగి ఉంటుంది. అహ్మదాబాద్‌లో కూలిపోయిన బోయింగ్ స్మార్ట్ లైనర్ విమానంలో లక్షా 25 వేల లీటర్ల ఇంధనం ఉందని చెబుతున్నారు. 625 అడుగుల ఎత్తులో ఉండగా ఎటిసితో అనుసంధానం కోల్పోయిన ఈ విమానం %–% వేగంగా ల్యాండు అవుతున్నట్టుగా జనావాసాల మీద కూలిపోయింది. ఆ మరుక్షణమే నల్లని పొగతో కూడిన మంటలు పెద్దఎత్తున ఎగసిపడ్డాయి. పరుగున వెళ్లి చూసిన స్థానికులను మంటల మధ్య కుప్పలుగా ఉన్న విమాన శకలాలు, చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాల దృశ్యాలూ తీవ్రంగా కలిచివేశాయి. ఆర్నెల్ల క్రితమే వివాహమై లండన్‌లో ఉన్న భర్త దగ్గరకు ఎన్నో ఆశలతో ప్రయాణమైన రాజస్థాన్ యువతి ఖుష్బూ ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. గమ్యం చేరకుండానే గాల్లో కలిసిపోయిన ప్రయాణికుల విషాదం వెనుక ఇలాంటి హృదయ విదారక కథనాలు ఎన్నో!

ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా సురక్షితంగా ఉండేందుకు విమానాల్లో ఇంజన్లు సహా అన్ని నిర్వహణ వ్యవస్థలూ రెండేసి అందుబాట్లో ఉంటాయి. టేకాఫ్ కావటానికి ముందు పూర్తి స్థాయి తనిఖీలు జరుగుతాయి. అన్ని స్థాయుల్లోనూ ఆమోదం ఉంటేనే ప్రయాణానికి అనుమతి లభిస్తుంది. ఇన్ని భద్రతా అంచెల తరువాత కూడా ప్రమాదం జరిగిందంటే– దాని వెనుక ఉన్న కారణాలు ఏమిటో దర్యాప్తులో తేలాలి. గతేడాది జూన్, డిసెంబరు నెలల్లో ఈ విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, వాటి పూర్తి నివారణ జరక్కపోవడమే ఈ ప్రమాదానికి కారణమై ఉండొచ్చని కొందరు సందేహం వ్యక్తం చేస్తున్నారు. పక్షులు ఢకొనేటం వల్ల ఇంజన్లు రెండూ విఫలమై ఉండొచ్చని మరికొందరు విమానయాన నిపుణులు అంటున్నారు. సమగ్ర దర్యాప్తుతోనే అసలు కారణాలు తేలతాయి. ఆలోగా మృతుల కుటుంబాలకు దన్నుగా నిలవడం, క్షతగాత్రులైన విద్యార్థులకు, స్థానికులకు పూర్తి స్థాయి వైద్యం అందించటంబీ ధ్వంసమైన జనావాసాలను పునర్నిర్మించటం వంటి చర్యలను ప్రభుత్వం సత్వరంగా, బాధ్యతాయుతంగా చేపట్టాలి. చాలా మృతదేహాలు గుర్తించలేని స్థితిలో ఉన్నందున డిఎన్ఎ పరీక్షలు కీలకంగా మారతాయి. కొద్దిపాటి జాప్యం కూడా లేకుండా గుర్తింపు ప్రక్రియను వేగంగా నిర్వహించి, మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలి.

# పఠాన్‌కోట్‌లో వాయుసేన హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

**దిల్లీ: పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో వాయుసేనకు చెందిన అటాక్ అపాచీ హెలికాప్టర్ అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. నంగాల్‌పుర్ పరిధిలోని హాలెడ్ గ్రామంలో భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్ అత్యవసరంగా దిగింది. పఠాన్‌కోట్ వైమానిక దళ కేంద్రం నుంచి బయల్దేరిన హెలికాప్టర్, సాంకేతిక ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు సమాచారం అందడంతో.. ముందు జాగ్రత్త చర్యగా బహిరంగ ప్రదేశంలో ల్యాండ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. దీనివల్ల ప్రజా భద్రత, మౌలిక సదుపాయాలకు ఎటువంటి ముప్పు లేదని తెలిపారు. అయితే అత్యవసర ల్యాండింగ్‌కు గల కారణం గురించి వైమానిక దళం ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. పలువురు వైమానిక దళ అధికారులు, సాంకేతిక బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.**



ఏప్రిల్‌లోనూ జామ్‌నగర్‌లోని.. చెంగా గ్రామంలో భారత వాయుసేనకు చెందిన ఓ హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ జరిగింది. ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్‌ను అత్యవసరంగా కిందకు దించినట్లు అధికారులు పేర్కొన్నారు. గతేడాది ఏప్రిల్‌లో కూడా లద్దాఖ్‌లో నిర్వహిస్తున్న యుద్ధ శిక్షణలో ఈ రకానికి చెందిన హెలికాప్టర్ దెబ్బతినడంతో అత్యవసరంగా ల్యాండింగ్ చేయాల్సివచ్చింది. 2024 మేలో వైమానిక దళ హెలికాప్టర్ మధ్యప్రదేశ్‌లోని భింద్ వద్ద అత్యవసరంగా ల్యాండ్ అయింది. అప్పట్లో సాంకేతిక లోపాన్ని గుర్తించడంతో పైలట్లు దీనిని అక్కడి పొలాల్లో అత్యవసరంగా దించేశారు.ప్రపంచంలోనే అత్యుత్తమ అటాక్ హెలికాప్టర్‌గా అపాచీ పేరు తెచ్చుకొంది. వీటి కొనుగోలుకు 2015లో భారత్, అమెరికాతో ఒప్పందం చేసుకొంది. ఈ డీల్ విలువ రూ.13,952 కోట్లు. ఈ హెలికాప్టర్లను ఎగిరే యుద్ధ ట్యాంకులుగా నిపుణులు అభివర్ణిస్తారు.

## బ్లాక్ బాక్స్ స్వాధీనం..

విశ్లేషణ తర్వాతే ప్రమాదానికి కచ్చితమైన కారణాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

**28 గంటల్లో బ్లాక్ బాక్స్ స్వాధీనం చేసుకున్నాం: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ విమానానికి చెందిన బ్లాక్ బాక్స్‌ను అధికారులు నేడు స్వాధీనం చేసుకున్నారు. ఈ దుర్ఘటనలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీతో సహా మొత్తం 241 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ప్రమాద కారణాలను వెలికితీయడంలో ఈ బ్లాక్ బాక్స్ అత్యంత కీలకమైన ఆధారంగా మారనుంది. విమాన ప్రమాదాల దర్యాప్తు సంస్థ (ఏఏఐబీ) తెలిపిన వివరాల ప్రకారం, ఈ బ్లాక్ బాక్స్‌ను ప్రమాద స్థలానికి సమీపంలోని ఒక భవనం పైకప్పుపై కనుగొన్నారు. అహ్మదాబాద్‌లోని మేఘానినగర్ ప్రాంతంలో ఉన్న బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ భవనం మెస్ సమీపంలో విమానం కూలిపోయిన సంగతి తెలిసిందే. "బ్లాక్ బాక్స్‌ను బిల్డింగ్ పైకప్పు మీద కనుగొన్నాం" అని ఏఏఐబీ అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా ధృవీకరించారు. ప్రమాదం జరిగిన 28 గంటల వ్యవధిలోనే ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) అధికారులు బ్లాక్ బాక్స్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారని మంత్రి తెలిపారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక ప్రకటన చేశారు. ఈ బ్లాక్ బాక్స్ లభ్యం కావడం దర్యాప్తు ప్రక్రియలో చాలా ముఖ్యమైన ముందడుగు అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. "అహ్మదాబాద్‌లోని ప్రమాద స్థలం నుండి 28 గంటల్లోపు ఫ్లైట్ డేటా రికార్డర్ (బ్లాక్ బాక్స్)ను ఏఏఐబీ స్వాధీనం చేసుకుంది. ఇది దర్యాప్తులో ఒక ముఖ్యమైన ముందడుగు. ఈ ఘటనపై విచారణకు ఇది గణనీయంగా సహాయపడుతుంది" అని మంత్రి తన పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఏఏఐబీ అధికారులు ఈ బ్లాక్ బాక్స్‌లోని సమాచారాన్ని డీకోడ్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియ పూర్తయితే ప్రమాదానికి సంబంధించిన అనేక ప్రశ్నలకు సమాధానాలు లభించే అవకాశం ఉంది.

## ఇరాన్ -ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం

ఘటనతో ఇరు దేశాల మధ్య వైరం తారాస్థాయికి చేరింది.

**'ఆపరేషన్ రైజింగ్ లయన్' వివరాలు**

శుక్రవారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్'ను ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇరాన్ వ్యాప్తంగా ఉన్న అణు కేంద్రాలు, సైనిక స్థావరాలపై దాడులు జరిపినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, ఇరాన్ ప్రధాన యురేనియం శుద్ధి కేంద్రమైన నతాన్జ్‌లో పలు భారీ పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ మీడియా వర్గాలు, ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. ఈ దాడుల నేపథ్యంలో ఇరాన్ నుంచి ప్రతీకార దాడులు జరగవచ్చనే ఆందోళనతో ఇజ్రాయెల్ దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించి, తమ సైనిక బలగాలను మోహరించింది.

**మృతి చెందిన ఇరాన్ ఉన్నతాధికారులు**

ఇజ్రాయెల్ జరిపిన ఈ దాడుల్లో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కమాండర్–ఇన్–చీఫ్ జనరల్ హొస్సేన్ సలామీ మరణించారు. 2019లో సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ చేత నియమితుడైన సలామీ, టెహ్రాన్‌లోని ఐఆర్‌జీసీ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిలో ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. ఈ దాడుల్లో మరణించిన వారిలో ఇరాన్ అత్యున్నత సైనికాధికారి, సాయుధ దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ మేజర్ జనరల్ మొహమ్మద్ బఘేరి కూడా ఉన్నారు. సైనిక అధికార క్రమంలో సుప్రీం లీడర్ తర్వాత బఘేరి రెండవ స్థానంలో ఉండేవారు. మరో కీలక వ్యక్తి, ఖతమ్ అల్–అన్బియా రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి నేతృత్వం వహిస్తున్న జనరల్ ఘోలం అలీ రషీద్ కూడా ఈ దాడుల్లో మరణించినట్లు సమాచారం. సుప్రీం లీడర్ సలహాదారు, ఐఆర్‌జీసీ మాజీ కమాండర్ అలీ షమా?నీ ఈ దాడిలో తీవ్రంగా గాయపడినట్లు ఇరాన్ స్థానిక వార్తా సంస్థలు నివేదించాయి.

**అణు శాస్త్రవేత్తల మరణం**

ఇజ్రాయెల్ దాడులు ఇరాన్ అణు కార్యక్రమాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడుల్లో ఆరుగురు ప్రముఖ అణు శాస్త్రవేత్తలు మరణించారు. వారిలో అబ్దొల్‌హమీద్ మినౌచెహ్ర్, అహ్మద్‌రెజా జోల్ఫాఘరీ, అమీర్‌హొస్సేన్ ఫెక్షీ, మొతాలెబ్లిజాదే, మొహమ్మద్ మెహదీ తెహ్రాంచీ, ఫెరీడౌన్ అబ్బాసీ ఉన్నారు.

**వేల కిలోమీటర్ల ఆవల నుంచి గురితప్పకుండా...!**

వేల కిలోమీటర్ల ఆవల నుంచి కూడా ఇజ్రాయెల్ గురితప్పకుండా లక్ష్యాలను ఛేదించిన తీరు అచ్చెరువొందిస్తోంది. అపార్ట్ మెంట్లలో నివసిస్తున్న సైనికాధికారులు, సైంటిస్టులను అత్యంత కచ్చితత్వంతో హతమార్చినట్టు తెలుస్తోంది. అదే అపార్ట్ మెంట్లలో సాధారణ పౌరులు కూడా ఉంటున్నప్పటికీ, వారికి ఎలాంటి హాని జరగకుండా, టార్గెట్లను ఫినిష్ చేయడం ఇజ్రాయెల్ డిఫెన్స్ టెక్నాలజీకి అద్దం పడుతోంది. ఈ మేరకు కొన్ని ఫొటోలు ఇంటర్నెట్లో వైరల్ అవుతున్నాయి.

**ఇరాన్ ప్రతిస్పందన, అంతర్జాతీయ పరిణామాలు**

ఇజ్రాయెల్ చర్యలను ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయెల్ దుర్మార్గమైన, రక్తపాత చర్యలకు పాల్పడిందని, ఇరాన్‌పై జరిగిన ఈ నేరానికి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల నేపథ్యంలో తక్షణ అంతర్జాతీయ స్పందనలు వెల్లువెత్తాయి. పలు విమానయాన సంస్థలు ఇజ్రాయెల్, ఇరాన్, ఇరాక్, జోర్డాన్ గగనతలాలపై విమాన సర్వీసులను దారి మళ్లించాయి. ఈ ఘటనతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొంది, భవిష్యత్ పరిణామాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

## కోర్ ఏరియాలో రూ.1052 కోట్లతో సదుపాయాలు

కార్యాలయాలు నిర్మిస్తున్న కొండమరాజు పాలెంలోని ప్రభుత్వ కోర్ ఏరియాలో నిర్మాణాలకు ముందుగానే సదుపాయాల కల్పన కూడా చేయాలని నిర్ణయించారు. ఈ ప్రాంతంలో సెక్రటేరియట్, అసెంబ్లీ, హైకోర్టు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఉన్నతాధికారులు, జడ్జిల భవనాలు ఉండనున్నాయి. వీటిల్లో విద్యుత్, రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ వంటి సదుపాయాల కోసం రూ.1052 కోట్లు వెచ్చించనున్నారు. గీన్ అండ్ బ్లూ ప్లానింగుపైనా ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిసింది. కరకట్ట విస్తరణతోపాటు, రిజర్వాయర్లు, కాలువల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆమోదించిన ప్లానును అమలు చేయాలని సిఎం అధికారులకు సూచించారు. అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు వీలుగా 30 శాతం గ్రీన్ అండ్ బ్లూ జోన్ ఏర్పాటు చేయాలనీ తీర్మానించారు. పధాన పనుల బాధ్యతను సిఆర్‌డిఏ నుండి ఎడిసికి బదలాయించే అంశంపై చర్చించారు. ఇప్పటికే పనుల బాధ్యతను బదలాయించినందున అధికారులతో సమస్యలు లేకుండా చూడాలని, ఎక్కడా పొరపాట్లు జరగరాదని ఆదేశించారు. సిసిడిఎంసి బాధ్యతలపైనా ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణతోపాటు, సిఎస్ విజయానంద్ తదితరులు పాల్గన్నారు.

## విజయ్ భాయ్ ఇక లేరంటే నమ్మలేకపోతున్నాను: ప్రధాని మోదీ

కలిసి నా సంతాపం తెలియజేశాను. విజయ్‌భాయ్ ఇక లేరనే వార్తను నేను అంగీకరించలేకపోతున్నాను. ఆయనతో నాకు సంవత్సరాల తరబడి అనుబంధం ఉంది. ఎన్నో క్లిష్ట సమయాల్లో మేమిద్దరం భుజం భుజం కలిపి పనిచేశాం" అని ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రూపానీ అత్యంత నిరాడంబరమైన, సౌమ్య స్వభావం కలిగిన వారని, కష్టపడి పనిచేసే తత్వం, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండేవారని ప్రధాని కొనియాడారు. పార్టీ సంస్థాగత బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూనే ఆయన గుజరాత్ ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని గుర్తు చేసుకున్నారు. రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసినా, రాజ్యసభ సభ్యుడిగా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా, కేబినెట్ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించినా, ప్రతి పాత్రలోనూ విజయ్ రూపానీ తనదైన ప్రత్యేక ముద్ర వేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "విజయ్‌భాయ్ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనతో కలిసి పనిచేసే అవకాశం నాకు లభించింది. గుజరాత్ అభివృద్ధి ప్రస్థానాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన ఎన్నో చర్యలు తీసుకున్నారు, అందులో 'ఈజ్ ఆఫ్ లివింగ్' (జీవన సౌలభ్యం) ఒకటి. ఆయనతో జరిగిన సమావేశాలు, చర్చలు ఎప్పటికీ గుర్తుంటాయి" అని ప్రధాని మోదీ తెలిపారు. విజయ్ రూపానీ గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణిస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకే విమానం కుప్పకూలింది. ఈ విమానంలో ఇద్దరు పైలట్లు, 10 మంది సిబ్బందితో పాటు 230 మంది ప్రయాణికులు, మొత్తం 242 మంది ఉన్నారు. ఈ ప్రమాదంలో భారత సంతతికి చెందిన బ్రిటిష్ ప్రయాణికుడు విశ్వాస్ కుమార్ రమేశ్ ఒక్కరే ప్రాణాలతో బయటపడ్డారు. ప్రధాని మోదీ అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విశ్వాస్ కుమార్‌ను కూడా పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

## కొమ్మినేనికి సుప్రీంలో ఊరట లభించడంపై జగన్ స్పందన

తాను చేయని వ్యాఖ్యలను కొమ్మినేని గారికి ఆపాదించి, దానిచుట్టూ తన ఎల్లో గ్యాంగ్‌ద్వారా పథకం ప్రకారం విషప్రచారం చేయించారు. వాటిని పట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా రౌడీయిజం చేశారు, ఆస్తులను ధ్వంసం చేశారు. మహిళల నిరసన పేరుతో ఒక ముసుగు వేసుకుని సాక్షి మీడియా యూనిట్ ఆఫీసులమీద, కార్యాలయాలమీద అరాచకంగా దాడులు చేయించారు. మీడియా స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని కాలరాశారు. చంద్రబాబు తన తప్పును తెలుసుకోకుండా ఇంకా ఆ వ్యాఖ్యలను వైసీపీకి, సాక్షి మీడియాకు ఆపాదిస్తూ జుగుప్సాకరంగా మాట్లాడ్డంతోనే ఆయన రాజకీయ లబ్ధికోసం ఈ కుట్రపన్నారని అర్థం అవుతోంది. యాంకర్‌గా వ్యవహరించిన కొమ్మినేని గారికి విశ్లేషకుడి వ్యాఖ్యలతో ఏం సంబంధం అంటూ? ఇవాళ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆర్డర్ చంద్రబాబు కుట్రను బద్దలు చేసింది, ఎండగట్టింది. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ అరెస్టుల అంశం మరోసారి దేశం దృష్టికి వెళ్లింది. వక్రీకరణలు, అబద్ధాలు ఎల్లకాలం చెల్లుబాటు కావు.... సత్యమేవ జయతే" అంటూ జగన్ పేర్కొన్నారు.

## అమరావతి మహిళలను కించపరిచిన కేసులో కొమ్మినేనికి బెయిల్

సుప్రీం ధర్మాసనం సూచించింది. భవిష్యత్తులో మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. కింది కోర్టు విధించిన షరతులకు లోబడే బెయిల్ మంజూరీ చేస్తున్నామని పేర్కొంది. విడుదలకు సంబంధించిన అన్ని నిబంధనలు ట్రయల్ కోర్టు ఇస్తుందని న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం స్పష్టం చేసింది.

కేసు వివరాలు...

నవ్యాంధ్ర రాజధాని అమరావతి వేశ్యల రాజధాని అని జగన్ చానల్లో తీవ్ర వ్యాఖ్యలు చేసిన కేసులో యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావును పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల జగన్ చానల్లో యాంకర్ కొమ్మినేని నిర్వహించిన లైవ్ డిబేట్లో.. అమరావతి దేవతల రాజధాని కాదు... వేశ్యల రాజధాని అని కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేశారు. కొమ్మినేని ఆయనను వారించకుండా చర్చను కొనసాగించారు. దీనిపై రాజధాని ప్రాంతం సహా రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకాయి. మహిళలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేస్తున్నా.. ఆ ఇద్దరు గానీ, సాక్షి యాజమాన్యం గానీ కనీసం క్షమాపణలు చెప్పకపోవడంతో వారు మండిపడుతున్నారు.

కొమ్మినేని అరెస్టు ఇలా..

ఈ క్రమంలో రాజధాని ప్రాంత దళిత జేఏసీ నాయకురాలు కంభంపాటి శిరీష తుళ్లూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. కృష్ణంరాజు, కొమ్మినేని, సాక్షి యాజమాన్యంపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతోపాటు పలు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం తుళ్లూరు పోలీసులు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టుల కాలనీకి వెళ్లి కొమ్మినేని నివాసంలో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్లో హాజరుపరిచి.. అక్కడి నుంచి ట్రాన్సిట్ వారెంట్‌పై సోమవారం రాత్రికి విజయవాడ తీసుకొచ్చారు. తొలుత రాజధానిలోని తుళ్లూరు పోలీసు స్టేషన్‌కు గానీ.. లేదంటే గుంటూరు గానీ తీసుకురావాలని భావించారు. అయితే ఈ ప్రాంతంలో తీవ్ర ఆగ్రహంతో ఉన్న మహిళలు ప్రతిఘటించవచ్చని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో పోలీసులు విజయవాడలోనే ఆయన్ను రహస్య ప్రాంతంలో ఉంచారు. రాత్రి పొద్దుపోయాక నల్లపాడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. మంగళవారం ఉదయం మంగళగిరి కోర్టులో కొమ్మినేని హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించింది.

జర్నలిస్టు కృష్ణంరాజు అరెస్టు...

జగన్ చానల్ డిబేట్‌లో అమరావతి ప్రాంత మహిళలను తీవ్రంగా కించపరుస్తూ దారుణ వ్యాఖ్యలు చేసిన కేసులో పరారీలో ఉన్న ఏ1, సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. బుధవారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో కృష్ణంరాజు ఫార్చునర్ వాహనంలో శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వస్తున్నట్టు గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఉన్నతాధికారులు విజయనగరం పోలీసులతో పాటు విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీని అప్రమత్తం చేశారు. కృష్ణంరాజు ప్రయాణిస్తున్న కారు విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి దాటి విశాఖపట్నం జిల్లా భీమిలి మండల పరిధిలోని అమనాం జంక్షన్‌కు చేరుకుంది. అప్పటికే అక్కడ మాటువేసిన భీమిలి పోలీసులు ఆ వాహనాన్ని ఆపి, అందులో ఉన్న కృష్ణంరాజుతోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తుళ్లూరు పోలీసులకు అప్పగించారు. దీంతో కృష్ణంరాజును రోడ్డుమార్గంలో బుధవారం రాత్రికి నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాక్షి టీవీ చానల్‌లో ఈ నెల 6న నిర్వహించిన డిబేట్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు రాజధాని అమరావతిని వేశ్యల రాజధానిగా అభివర్ణించిన విషయం తెలిసిందే.

## లై డిటెక్టర్ టెస్టుకు నేను సిద్ధం.. సీఎం రేవంత్ సిద్ధమేనా ? : కేటీఆర్

డ్రామాలు చేస్తూ కుట్రలు పన్నుతున్నాడు. కానీ ఈ చిల్లర చేష్టలతో మమ్మల్ని అడ్డుకోలేరు. తెలంగాణ ప్రజల గొంతుకై మేము పోరాడుతూనే ఉంటాం," అని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేసు నిర్వహణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం బ్యాంకు ద్వారా పంపిన రూ.44 కోట్లు ఇప్పటికీ ఫార్ములా ఈ సంస్థ ఖాతాలోనే ఉన్నప్పటికీ, వాటిని వెనక్కి రప్పించలేని ముఖ్యమంత్రి మరోసారి ఏసీబీ నోటీసులు పంపినట్టు విమర్శించారు. చట్టాలను గౌరవించే పౌరుడిగా వచ్చే సోమవారం (జూన్ 16న) ఉదయం 10 గంటలకు ఏసీబీ విచారణకు హాజరయ్యి, అన్నివిధాల సహకరిస్తానని స్పష్టం చేశారు.అయితే, పదేళ్ల క్రితం నోటుకు ఓటు కేసులో నల్లబ్యాగుతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ సీఎం రేవంత్ రెడ్డి కేసు ఇప్పటికీ ఏసీబీ పరిధిలో పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. "ఇద్దరిపై ఏసీబీ కేసులున్న నేపథ్యంలో నిజమైన దోషుడు ఎవరో, నిర్దోషుడు ఎవరో తేల్చేందుకు జడ్జి సమక్షంలో లైవ్ టెలివిజన్ ద్వారా లై డిటెక్టర్ టెస్టుకు సిద్ధమా సీఎం రేవంత్?" అని సూటిగా ప్రశ్నించారు. ఓవైపు ఖజానా ఖాళీ అని నిస్సిగ్గుగా రాష్ట్ర అసమర్థతను ఒప్పుకుంటున్న ముఖ్యమంత్రి, ఇప్పుడు దర్యాప్తుల పేరుతో ప్రజా ధనాన్ని వృథా చేయవద్దని, వెంటనే లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం కావాలని కేటీఆర్ సవాలు విసిరారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

జనరల్ న్యూస్

https://epaper.teluguraastram.com

అమలాపురం
జూన్ 14,
శనివారం 2025



# విమానం కూలగానే..

# 1000 డిగ్రీల ఉష్ణోగ్రతతో మంటలు

**అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదం వందల కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. టేకాఫ్ అయిన కొన్ని క్షణాలకే ఈ విమానం కుప్పకూలి మంటల్లో దగ్ధమైంది. ప్రమాదానికి కారణమేంటనే దానిపై స్పష్టత రానప్పటికీ.. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ విమానం కూలిన తర్వాత ఘటనా స్థలంలో 1000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో మంటలు చెలరేగినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో సహాయక చర్యలు అత్యంత క్లిష్టంగా మారినట్లు పేర్కొన్నారు.**



ప్రమాదానికి గురైన విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉందని, మంటలు వ్యాపించడంతో ఎవరినీ కాపాడే పరిస్థితి లేకుండా పోయిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించిన సంగతి తెలిసిందే. దీనిపై ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి ఒకరు స్పందించారు. "ప్రమాదం గురించి సమాచారం రాగానే మధ్యాహ్నం 2-2.30 గంటల ప్రాంతంలో మా సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. అంతకుముందే హాస్టల్‌లో శిథిలాల కింద చిక్కుకున్న కొంతమందిని స్థానికులు కాపాడారు. మంటలు వ్యాపించడం ఎక్కువైన తర్వాత పరిస్థితి చేదాటిపోయింది" అని ఆ అధికారి వివరించారు.

"గతంలో మేం ఎన్నో సహాయక చర్యలు చేపట్టాం. కానీ, ఇలాంటి విపత్తును ఇంతకుముందెప్పుడూ చూడలేదు. విమానంలోని ఇంధన ట్యాంక్ పేలిపోవడంతో అగ్నిగోళం ఏర్పడింది. క్షణాల వ్యవధిలోనే అక్కడి ఉష్ణోగ్రత 1000 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగింది. దీంతో బయటపడే అవకాశం లేకుండా పోయింది. మేం పీపీఈ కిట్లు వేసుకొని ఘటనాస్థలానికి చేరుకున్నా.. వేడి తీవ్రత చాలా ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగింది. పక్షులు, శునకాలు కూడా పారిపోలేనంత స్థాయిలో ఉష్ణోగ్రత ఉంది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో పలు పక్షులు, శునకాలు కాలిబూడిదయ్యాయి. ఎటుచూసినా శిథిలాలే కన్పించాయి. వాటి కింద తీవ్రంగా కాలిపోయిన ప్రయాణికులను గుర్తించడం సవాల్‌గా మారింది" అని మరో అధికారి ఆ భయానక దృశ్యాలను గుర్తుచేసుకున్నారు.

ఈ ప్రమాదంలో విమానంలోని 241 మందితో పాటు వైద్యకళాశాల హాస్టల్‌లో ఉన్న 24 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరి మృతదేహాలకు అహ్మదాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించారు. ప్రమాదం ధాటికి చాలా మృతదేహాలు గుర్తుపట్టలేనివిధంగా కాలిపోయాయి. దీంతో డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్నారు.

# ఇజ్రాయెల్ భీకర దాడులు..

# ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ చీఫ్ మృతి

**జెరూసలెం: పశ్చిమాసియా మళ్లీ రగులుతోంది. ప్రపంచ దేశాల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో విరుచుకుపడింది. ఈ భీకర దాడుల్లో ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్ చీఫ్ సహా పలువురు కీలక వ్యక్తులు మరణించారు. ఈమేరకు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.**



"ఐఆర్‌జీసీ హెడ్‌క్వార్టర్స్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఈ దళం అధిపతి మేజర్ జనరల్ హొస్సేన్ సలామీ మరణించారు" అని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈయనతో పాటు రెవల్యూషనరీ గార్డ్‌లోని ఇతర టాప్ అధికారులు, ఇద్దరు అణు శాస్త్రవేత్తలు కూడా మరణించినట్లు తెలిపాయి. సలామీ మృతిని ఇరాన్ అధికారిక మీడియా సంస్థ ధ్రువీకరించింది.

### యురేనియం శుద్ధి కేంద్రంపై దాడులు..

ఇరాన్ కాలమానం ప్రకారం.. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ తొలుత దాడులు చేసింది. ఆ తర్వాత శుక్రవారం ఉదయం రెండో దశ దాడులు ప్రారంభించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్‌లోని న్యూక్లియర్ ప్లాంట్, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెల్ అవీవ్ విరుచుకుపడుతోంది. యురేనియం శుద్ధి కేంద్రంపై ఇజ్రాయెల్‌కు చెందిన జెట్లు పలుమార్లు దాడులు చేసినట్లు ఆ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రాంతంలో భారీఎత్తున పొగ కమ్ముకున్న దృశ్యాలు బయటికొచ్చాయి. ఇక, నతాంజ్ ప్రాంతంలోని అణుకేంద్రం వద్ద తాజాగా మరోసారి పేలుళ్లు సంభవించినట్లు తెలుస్తోంది.

### ఇరాక్ గగనతలం మూసివేత..


ఉద్రిక్తతల దృష్ట్యా ఇరాక్ ముందుజాగ్రత్త చర్యగా తమ గగనతలాన్ని మూసివేసింది. దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలను నిలిపివేసింది. అటు టెహ్రాన్‌లో అత్యయిక స్థితిని ప్రకటించారు.

### మాకు మరో అవకాశం లేదు: ఇజ్రాయెల్ ఆర్మీ చీఫ్

తాజా పరిణామాలపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ స్పందించారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఈ దాడులు ప్రారంభించినట్లు తెలిపారు. "ప్రతిచర్యకు మరో సందర్భం కోసం మేం ఎదురుచూడలేం. ఇక సమయం వచ్చింది. మాకు మరో అవకాశం లేకుండా పోయింది. మమ్మల్ని నాశనం చేయాలనుకునే వారి ముందు మేం తలవంచే ప్రసక్తే లేదు. మా అస్థిత్వాన్ని రక్షించుకునేందుకు పోరాడుతూనే ఉంటాం" అని జమీర్ స్పష్టం చేశారు.

# ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం.. భగ్గుమన్న చమురు ధరలు

**ఇజ్రాయెల్.: ప్రపంచ దేశాల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేసింది. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. దీంతో శుక్రవారం అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు 12 శాతం పైగా పెరిగాయి. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ బ్యారెల్ 12.6 శాతం పెరిగి 76.61 డాలర్లకు చేరుకోగా, బ్రెంట్ నార్త్ సీ క్రూడ్ 12.2 శాతం పెరిగి 77.77 డాలర్లకు చేరింది.**



ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఘర్షణ వాతావరణం చమురు ధరలపై ప్రభావం చూపుతోంది. ఈ దాడులతో హార్మోజ్ జలసంధి ద్వారా జరిగే గ్లోబల్ ఆయిల్ సరఫరాకు అంతరాయం ఏర్పడొచ్చనే ఆందోళనలు పెరిగాయి. ఈ నేపథ్యంలో చమురు రంగ షేర్లు ఒత్తిడికి లోనవుతున్నాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ షేర్లు 6.1 శాతం తగ్గి రూ.299.20 వద్ద ట్రేడవుతున్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ షేర్లు 3.9 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ షేర్లు 5.3 శాతం నష్టపోయాయి.

### కీలక జలసంధి..

ఒమన్-ఇరాన్ సముద్రమార్గంలో హార్మోజ్ జలసంధి ఉంటుంది. దాదాపు 40 కి.మీ. మేర ఇరుకైన ప్రదేశం ఉండగా.. అందులో 2. కి.మీ.లు నౌకల రాకపోకల కోసం నావిగేషన్ ఛానల్ ఉంటుంది. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్, ఇరాక్, ఇరాన్ దేశాల నుంచి వివిధ దేశాలకు రోజుకు 2.1 కోట్ల (21 మిలియన్) బ్యారెళ్ల చమురు ఎగుమతి అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా రోజువారీ వినియోగంలో ఇది 21శాతం. అంతర్జాతీయంగా ఎల్ఎన్‌జీ వినియోగంలోనూ 20శాతం ఇక్కడినుంచే సరఫరా జరుగుతోంది.

# విమాన ప్రమాదం.. సహాయక చర్యలకు అండగా ఉంటాం: రిలయన్స్



**అహ్మదాబాద్ : అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ దంపతులు సానుభూతి తెలిపారు. అక్కడ కొనసాగుతోన్న సహాయక చర్యలకు సాయం చేయడానికి తమ సంస్థ సిద్ధంగా ఉందన్నారు.**

ఈ విషయాన్ని తెలుపుతూ రిలయన్స్ నేడు ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రమాదం తననెంతో కలచివేసిందని అంబానీ దంపతులు ఈ సందర్భంగా విచారం వ్యక్తం చేశారు. "అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో జరిగిన ప్రాణనష్టం చూసి మాతో పాటు రిలయన్స్ కుటుంబం మొత్తం ఆవేదనకు గురైంది. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేస్తున్నా. ప్రస్తుతం అక్కడ కొనసాగుతోన్న సహాయక చర్యలకు రిలయన్స్ మద్దతు ఇస్తుంది. సాధ్యమైనంత వరకూ అన్నివిధాలా సాయం చేయడానికి సిద్ధంగా ఉంది. బాధితులకు జరిగిన నష్టాన్ని తట్టుకునే శక్తిని ఇవ్వాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాం" అని ముఖేశ్ దంపతులు తెలిపారు.

గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం గురువారం కుప్పకూలి మంటల్లో దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో 241 మంది ప్రయాణికులు, సిబ్బంది చనిపోయారు. వైద్య కళాశాల సముదాయంపై విమానం కూలడంతో మరో 24 మంది మృతి చెందారు. ఈ విషాదంపై పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# బ్లాక్‌బాక్స్ ఇంకా దొరకలేదు: ఎయిరిండియా



**అహ్మదాబాద్ : అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం గురువారం ఘోర ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో మొత్తం 265 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదానికి గురైన విమానానికి సంబంధించిన బ్లాక్ బాక్స్ లభించినట్లు వస్తున్న ఊహాగానాలను ఎయిరిండియా కొట్టిపడేసింది.**

'విమాన ప్రమాదానికి సంబంధించిన కీలక సమాచారం అందించే బ్లాక్ బాక్స్ ఇంకా లభించలేదు. దొరికినట్లు వస్తున్న వార్తలు ఊహాగానాలు మాత్రమే' అని ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా.. ప్రమాదానికి గురైన విమాన శిథిలాల నుంచి డిజిటల్ వీడియో రికార్డర్ (డీవీఆర్)ను ఎయిరిండియా స్వాధీనం చేసుకుంది. ఏటీసీ అధికారి ఒకరు ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

### ఏంటీ బ్లాక్ బాక్స్..

ప్రతి కమర్షియల్ విమానంలో రెండు బ్లాక్‌బాక్స్‌లు ఉంటాయి. అందులో ఒకటి ఫ్లైట్ డేటాను రికార్డ్ చేయగా.. మరొకటి కాక్‌పిట్ వాయిస్ రికార్డుకు ఉపయోగపడుతుంది. విమానాలకు ఏదైనా ముప్పు వాటిల్లినప్పుడు, అందులోని ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నప్పుడు పైలట్ మేడే అంటూ సందేశాన్ని పంపుతారు. అది కాక్‌పిట్‌లో రికార్డవుతోంది. ఈ సమయంలో వారు మాట్లాడుకున్న విషయాలన్నీ అందులో రికార్డవుతాయి. ప్రమాదాలు జరిగినప్పుడు బ్లాక్‌బాక్స్‌లోని డిజిటల్ ఫ్లైట్ డాటా రికార్డర్(డీఎఫ్‌డీఆర్)ను డీకోడ్ చేస్తారు. దీంతో

# త్వరలో భారత్ నుంచి చైనాకు నేరుగా విమాన సర్వీసులు



**చైనా :** కొవిడ్, గల్వాన్ సంఘర్షణల నేపథ్యంలో గతంలో భారత్, చైనా విమాన సర్వీసులు నిలిపివేసిన విషయం తెలిసిందే. ఐదేళ్ల తర్వాత నేరుగా విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించడానికి కొంతకాలంగా ఇరుదేశాలు చర్చలు జరుపుతున్నాయి. ఈనేపథ్యంలో భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ కీలక ప్రకటన చేశారు. చైనా విదేశాంగశాఖ ఉప మంత్రి సన్ వీడాంగ్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు నడపటంపై చర్చలు జరిగాయని, త్వరలోనే తుది నిర్ణయం వెలువడుతుందని పేర్కొన్నారు. కైలాస్ మానస సరోవర యాత్రకు చైనా అందిస్తున్న సహకారాన్ని కూడా మిస్రీ అభినందించారు.

ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న చైనా విదేశాంగశాఖ ఉప మంత్రి సన్ వీడాంగ్‌తో సమావేశంలో భాగంగా ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను తిరిగి పునర్ నిర్మించడానికి చర్చలు జరిపినట్లు మిస్రీ వెల్లడించారు. ఇరువురి మధ్య నిర్మాణాత్మకంగా, సానుకూల వాతావరణంలో సాగిన ఈ చర్చల్లో వాస్తవాధీనరేఖ దగ్గర నెలకొన్న పరిస్థితిని సమగ్రంగా సమీక్షించామన్నారు. ప్రత్యక్ష విమాన సర్వీసులను పునఃప్రారంభించడానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయడానికి ఇరుపక్షాలు అంగీకరించాయన్నారు. అదనంగా, వీసా ప్రక్రియలను సులభతరం చేయడం, మీడియా, పరిశోధనా సంస్థల మధ్య మార్పిడిని ప్రోత్సహించడం వంటి విషయాల్లో కలిసి పనిచేయడం పైనా సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు. ముఖ్యంగా వాణిజ్య, ఆర్థిక రంగాల్లో భారత్-చైనాల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొవిడ్ 19 మొదలైనప్పటినుంచి భారత్-చైనా మధ్య నేరుగా విమాన సర్వీసులు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల లద్దాఖ్ సరిహద్దులో బలగాల ఉపసంహరణ, గస్తీ పునఃప్రారంభం విషయంలో రెండు దేశాలు పలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఇందులో ఇరుదేశాలకు నేరుగా విమాన సర్వీసుల అంశం కూడా ఒకటి. ఈ ఒప్పందాలపై చర్చించడానికి భారత విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ జనవరిలో చైనాను సందర్శించారు. ఇరుదేశాల మధ్య విమాన సేవలను తిరిగి ప్రారంభించడానికి సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చినట్లు తెలిపారు.






తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
శనివారం 14 జూన్ 2025

# అధ్వానంగా ఏజెన్సీ రోడ్లు



**పోలవరం, జూన్ 13 (తెలుగు రాష్ట్రం విలేకరి):** పోలవరంలోని చుట్టుపక్కల గ్రామాలైన కొత్తరామయ్యపేట, బోడిగూడెం, వింజరం, ఇటికలకోట, గార్ల గొయ్యి, తదితర ఏజెన్సీ ప్రాంతాలలో రోడ్లు అద్వానంగా ఉన్నాయి. ఈ మార్గాలలో ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు నరకం చూడవలసి వస్తుందంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగాఈ రోడ్డు మార్గాల మరమత్తుల పట్టించుకునే నాయకుడే లేడని, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ రోడ్లు వేయాలని కోరుతున్నారు.

# బండారు బ్రదర్స్ అవినీతి పరంపర.

## -జగిరెడ్డి విమర్శలు




**రావులపాలెం: మే 13, (తెలుగు రాష్ట్రం విలేకరి):** అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిర్ల జగిరెడ్డి అధికార పక్షం మీద తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రావులపాలెం మండలంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, బండారు శ్రీనివాస్‌ల అవినీతి ఉదంతాలను ఎండగట్టారు. "గిన్నిస్ బుక్‌లో కూడా బండారు బ్రదర్స్ పేర్లు అవినీతికీ సంబంధించి ఉండాల్సిందే" అని సెటైర్లు వేస్తూ, కొత్తపేట నియోజకవర్గంలో వారు నిర్మించిన ఇసుక పిరమిడ్లను "8వ వింత"గా సంబోధించారు. "వాళ్లలో బ్రహ్మానందం ఎవరో, ఆలీ ఎవరో చెప్పాలంటే ప్రజలే నిర్ణయించాలి" అంటూ ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా, ప్రజలపై జరుగుతున్న అన్యాయాలపై శ్రద్ధ చూపకుండా, నాయకులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు. మాజీ ముఖ్యమంత్రి "జగన్ ఇచ్చిన అమ్మఒడి, చేయూత, కాపు నేస్తం వంటి పథకాలను నిలిపేసి, మళ్లీ వంచనల పాలన తెస్తున్నారు" అని ఆరోపించారు."చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' పథకం ద్వారా రాష్ట్ర ప్రజలను మళ్లీ మోసం చేయాలను కుంటున్నారు" అని వ్యాఖ్యానించారు. అలాగే, కొత్తపేట నియోజకవర్గం లోని బెల్ట్ షాపుల్లో జరుగుతున్న బీటాక్స్ వసూళ్లపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఉన్న విద్యార్థిని విద్యార్థులు అందరికీ తల్లికి వందనం ఇవ్వాల్సిందే

## - లేనిపోని సాకులతో అనర్హులను చెయ్యొద్దు -

## పిసిసి సభ్యులు గోపాలకృష్ణరాజు



**మలికిపురం జూన్ 13(తెలుగు రాష్ట్రం విలేకరి):** కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయిందని అందులో భాగంగా తల్లికి వందనం పథకంలో విద్యార్థికి 15 వేలకు బదులు 13 వేలు ఇవ్వడం, 2 వేలు పాఠశాల అభివృద్ధి కోసం అనడం, చిన్న చిన్న సాకులతో విద్యార్థినీ విద్యార్థులను అనర్హులను చేయడం సరికాదని అర్హులైన అందరికీ తల్లికి వందనం డబ్బులు కచ్చితంగా ఇవ్వాలని పిసిసి సభ్యులు రుద్రరాజు గోపాలకృష్ణరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మలికిపురం మండలం లక్కవరం లో ఏర్పాటు చేసిన సమావేశంలో గోపాలకృష్ణరాజు మాట్లాడుతూ ఒకే ఇంటిలో ఎంతమంది విద్యార్థులు ఉన్నా వారికి ఒక్కొక్కరికి 15 వేల రూపాయల చొప్పున తల్లుల అకౌంట్లో జమ చేస్తామని ప్రకటించి, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్కూళ్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి ఉంటే ప్రభుత్వ నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలి కానీ 2 వేల రూపాయలు తగ్గించటం విద్యార్థినీ విద్యార్థులమనోభావాలు దెబ్బతీసినట్లుగా ఉందని విమర్శించారు. విద్యార్థినీ, విద్యార్థులు బాగా చదువుకుని అభివృద్ధిలోకి వెళ్ళాలి అని ప్రభుత్వం అనుకుంటే మిగిలిన 2 వేల రూపాయలు కూడా వెంటనే తల్లుల అకౌంట్ కి జమ చేయాలని డిమాండ్ చేశారు.

# నాయీబ్రాహ్మణులకు పెరిగిన కనీస వేతన చెక్కుల అందజేత.

## -ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



**ఆత్రేయపురం: మే 13, (తెలుగు రాష్ట్రం విలేకరి):** కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యులు బండారు సత్యానందరావు శుక్రవారం వాడపల్లి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నాయీబ్రాహ్మణులకు పెరిగిన వేతన చెక్కులను స్వయంగా అందజేశారు. రాష్ట్రంలోని దేవస్థానాల్లో సేవలందిస్తున్న నాయీబ్రాహ్మణులకు కనీస వేతనాన్ని రూ. 20,000 నుండి రూ. 25,000కు పెంచినట్లు ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన ఎమ్మెల్యే సత్యానందరావు మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒకొకటిగా నెరవేర్చుతోంది. విశేషంగా ఆలయాల్లో సేవలందించే నాయీబ్రాహ్మణుల వేతనాల్లో ఇదే దృష్టితో పెంపు జరిగింది. ఆలయ సేవకులకు గౌరవం ఇవ్వడం మా బాధ్యత. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను తీసుకొస్తాం" అని పేర్కొన్నారు. నాయీ బ్రాహ్మణులు కూడా తమ వేతనాలు పెరిగినందుకు హర్షం వ్యక్తం చేసి, ప్రభుత్వం మరియు ఎమ్మెల్యే సత్యానందరావు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం ప్రజలతో నిండిపోయింది. వేద ఘోషల నడుమ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకటరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాధం తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు, ఆలయ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎమ్మెల్యే బండారు సంతాపం.

## -వాడపల్లిలో నివాళులు, బాధిత కుటుంబాలకు సంఘీభావం.



**కొత్తపేట: మే 13, (తెలుగు రాష్ట్రం విలేకరి):** అహ్మదాబాద్ సమీపంలో గురువారం చోటు చేసుకున్న ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం దేశవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. ఈ ఘోర ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయాల పాలయ్యారు. ప్రమాదం తీవ్రత దేశాన్ని విషాదంలో ముంచివేసింది. ఈ నేపథ్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకి చెందిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శుక్రవారం వాడపాలెం లో బాధితులకు నివాళులు అర్పించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన ఆయన, ప్రమాదంలో మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. "ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు తీవ్ర మానసిక వేదన అనుభవిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా అండగా ఉండాలని కోరుతున్నాను," అని బండారు అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. విమానయాన రంగంలో భద్రత ప్రమాణాలు మెరుగుపర్చాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. "మనదేశం ఎంతదూరమైనా, ఇలాంటి విషాదకర సంఘటనలప్పుడు మనం మానవీయంగా కలిసిపోవాలి," అని చెప్పారు.విమాన ప్రమాదంలో మరణించిన ప్రతి ఒక్కరికి దేశం గొప్ప నష్టం చవిచూస్తోందని ఆయన విచారం వ్యక్తం చేశారు.

# లొల్ల సైఫాన్ పనుల పరిశీలన.

## -పనుల వేగాన్ని పెంచాలని ఎమ్మెల్యే ఆదేశాలు.



**ఆత్రేయపురం, మే 13 (తెలుగు రాష్ట్రం విలేకరి):** లొల్ల గ్రామ సమీపంలో రూ.2.92 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న సైఫాన్ పనులను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన, అనుసంధాన శాఖ అధికారులతో చర్చించి కొన్ని కీలక సూచనలు చేశారు. ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా శనివారం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి దర్శనార్థం వచ్చే భక్తులకు ట్రాఫిక్ సంబంధిత ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటుచేయాలని స్పష్టం చేశారు. పనుల నాణ్యత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజాధనాన్ని వృథా చేయకుండా నిర్మాణంలో ప్రమాణాలు పాటించాలని సూచించారు. అధికారులతో పాటు గుట్టకట్టు సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఈ సందర్శనలో పాల్గొన్నారు.

# అమలాపురం డిపో సైకిల్ స్టాండుపై ఫిర్యాదు నిమిత్తం చర్యలు



**అమలాపురం, జూన్ 13 (తెలుగు రాష్ట్రం విలేకరి): :** అమలాపురం బస్టాండులోని సైకిల్ స్టాండులో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని వచ్చిన ఆరోపణలపై ఆర్.టీ.సి. అధికారులు స్పందించారు. అమలాపురం డిపోలోని సైకిల్ స్టాండుని తనిఖీ చేసి లైసెన్సుదారుడిని సదరు సంఘటన విషయమై ప్రశ్నించారు. వారిపై జరిమానా విధించి, అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూచుకోవాలని హెచ్చరించారు. వాహనల పార్కింగ్ నిమిత్తం వసూలు చేసే ధరల పట్టికను అందరికీ కనపడేటట్లు సైకిల్ స్టాండులో పలుచోట్ల ఏర్పాటు చేయించారు. ఇక మీదట ఏ విధమైన అధిక చార్జీలు వసూలు చేసినా వాహనదారులు బస్ స్టేషన్ లోని స్టేషన్ మేనేజర్ కి ఫిర్యాదులు చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకొనుట జరుగుతుందని అమలాపురం డిపో మేనేజర్ మూర్తి తెలిపారు.

# ఆత్మహత్యాయత్నం.సీఐ చొరవతో రక్షణ.



**రావులపాలెం: జూన్ 13 (తెలుగు రాష్ట్రం విలేకరి):** కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కాకినాడ జిల్లా బిక్కవోలు మండలానికి చెందిన పలివెల శైలజ (30) అనే మహిళ, తన భర్త రాజుతో కలహాల కారణంగా జీవితం తాలూకూ ఆశ కోల్పోయింది. దీంతో ఆమె జొన్నాడ వద్ద గోదావరి పై వంతెనపైకి చేరి దూకే ప్రయత్నం చేసింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న రావులాపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ తన సిబ్బందితో కలిసి పరిస్థితిని గమనించి వెంటనే స్పందించారు. అప్రమత్తంగా వ్యవహరించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శైలజను ఆలమూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. తర్వాత ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి.

# వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అవకతవకలపై విచారణ



**ఆత్రేయపురం: జూన్ 13, (తెలుగు రాష్ట్రం విలేకరి):** వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై కోకోఫెడ్, క్యాప్కో సంయుక్త ఆధ్వర్యంలో నిజ నిర్ధారణ కమిటీ శుక్రవారం ఆలయాన్ని పరిశీలించింది. కమిటీ చైర్మన్ అరిగెల బలరామమూర్తి, కార్యదర్శి ఆదిత్య కిరణ్, ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస గణేష్ తదితరులు ఆలయానికి చేరుకొని భక్తులు, సిబ్బంది, స్థానికుల అభిప్రాయాలను తీసుకున్నారు. తర్వాత దేవస్థానం డిప్యూటీ కమిషనర్, ఈవో చక్రధరరావును కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. టోల్ ప్లాజా తరహా విధానంపై వచ్చిన ఆరోపణలను ఈవో అంగీకరించగా, వెంటనే సరిచేస్తామన్నారు. దర్శన వ్యవస్థలో మార్పులపై కమిటీ సభ్యులు సూచనలు చేశారు. రకాల రేట్లు, రూట్ల పొంతన, ఆటంకాల నివారణ వంటి అంశాలపై ఈవోకు దిశానిర్దేశం చేశారు. ఈ కమిటీలో బీవీవీ సత్యనారాయణ, అద్దంకి అమరేశ్వరరావు, కత్తుల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# జొన్నాడలో రేషన్ బియ్యం పట్టివేత

## -నలుగురి పై కేసు నమోదు




**ఆలమూరు, జూన్ 13(తెలుగు రాష్ట్రం విలేకరి):** రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వ్యాన్ ను అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం శుక్రవారం అధికారులు పట్టుకున్నారు.స్థానిక సివిల్ సప్లై అధికారి

సిహెచ్ ఎస్ జి పద్మ చెప్పిన వివరాలు ప్రకారంకర్రి రామారెడ్డి ,విజ్జన సుదర్శన్ రావు, కాకిలేటి ప్రవీణ్ కుమార్, నిశ్చలకోల్ల జీవన్ కుమార్ ల ఆద్వర్యంలో అక్రమ పిడిఎప్ బియ్యం రవాణా అవుతున్నట్లు సమాచారం రావడంతో జొన్నాడ సెంటర్ లో కాపు కాసి పట్టుకున్నారు. 42 బస్తాలలో ఉన్న 2,110 కేజీల బియ్యాన్ని అధికారులు స్వాధీనపర్చుకున్నారు. వాటిని,వ్యాన్ ను ఆలమూరు పోలీస్ స్టేషన్కు అప్పగించినట్లు సివిల్ సప్లై అధికారిణి పద్మ తెలిపారు.

# మహిళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## -ఎమ్మెల్యే రోషన్ కుమార్



**చింతలపూడి, జూన్ 13 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** చింతలపూడి పట్టణంలోని వికెఎం ఫంక్షన్ హాలులో కేంద్ర హస్త కళల అభివృద్ధి కమిషనర్, మినిస్ట్రీ అఫ్ టెక్స్టైల్స్, గోవెర్నమెంట్ అఫ్ ఇండియా వారి ఆర్థిక సహకారంతో అపిటికో వారి ద్వారా , 50 మంది హస్త కళాకారులకు శాసన సభ్యులు సొంగా రోషన్ కుమార్ చేతుల మీదుగా ఇంప్రూవ్డ్ టూల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ మాట్లాడుతూ మహిళలకు టూల్ కిట్లను వినియోగించుకొని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో అపర్ణ లక్ష్మి, అసిస్టెంట్ డైరక్టర్ కేంద్ర హస్త కల అభివృద్ధి సంస్థ విజయవాడ, పీడీ సుధీర్ కుమార్, కన్సల్టెంట్ అపిటికో లిమిటెడ్, కే.సారధి, డీపీఎం డిఆర్డిఏ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకి ఇళ్ల పట్టాలివ్వాలి సిపిఎం డిమాండ్



**టీ. నర్సాపురం, జూన్ 13 (తెలుగురాష్ట్రం విలేఖరి):** గత 17 ఏళ్లగా టీ.నర్సాపురం పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని ఉంటున్న నిరుపేదలకు ఇంటి ఎంజాయ్మెంట్లు లోన్లు ఇవ్వాలని స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద ఏఎస్ఆర్ నగర్ వాసులు దరఖాస్తులు పెట్టుకున్నారని సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గూడెల్లి వెంకటరావు పత్రికలు ఉద్దేశించి మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా కాపురాలు ఉంటున్న పేదలకి సౌకర్యాలు కల్పించకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వం పేదల ఆక్రమణలో ఉన్న భూములను రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 30 ప్రకారం పేదల సాగులో ఆక్రమణలో ఉన్న స్థలాలు రెగ్యులర్ చేయాలని, జీవోను అనుసరించి ఏఎస్ఆర్ నగర్ ప్రజలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మడకం కుమారి శిరీష, అనుమోలు మురళి, పట్ల మంగ, బరగడ కుమారి పాల్గొన్నారు.

# బంజారా బహిరంగ బేరి ఆధ్వర్యంలో విద్యార్థులకు పలకల పంపిణీ



**టీ. నర్సాపురం, జూన్13 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** బంజారా భజరంగ్ భేరి సంఘం ఆధ్వర్యంలో ధరావత్ ప్రవీణ్ నాయక్ జ్ఞాపకార్థంగా కృష్ణాపురం గ్రామంలోని అంగన్వాడి కేంద్రం నందు విద్యార్థులకు సంఘ నాయకులు పలకలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ మాట్లాడుతూ ఆటపాటల ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం బాల్యం నుండే బలంగా అంగన్వాడి కేంద్రాలు నాటాలని అన్నారు. విద్యార్థుల్లో మూర్తిమత్వ వికాసంకు మంచి రూపాన్ని రూపొందించడంలో అంగన్వాడి టీచర్లు కృషి చేయాలని అన్నారు. సంఘ అధ్యక్షులు జరభల చందా నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన పిల్లలకు విద్యారంగంలో సహకారం అందించేందుకు సంఘం తరఫున పలకలను పంచడం జరిగిందని అన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి ధరావత్ రవి నాయక్ మాట్లాడుతూ బాల బాలికలకు అమ్మఒడి తర్వాత తొలిబడి అంగన్వాడీ కేంద్రమేననీ అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా సర్వేశ్వరరావు, లావుడియా నాగేంద్ర, భూక్యా సత్యం, జరభల యుగంధర్, హసావత్ వెంకటేశ్వరరావు, హసావత్ రావమ్మ, భూక్యా ధనలక్ష్మి, జరభల రమేష్, భూక్యా దుర్గారావు, జరభల రామకృష్ణ, జరభల పీరు, జరభల విజయ్, ధరావత్ పండు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత మహిళలకు వన్ స్టాప్ సెంటర్ ద్వారా మెరుగైన సహాయం అందించాలి

## -బాల్య వివాహాలు నివారించాలి..9వ తరగతి ఉత్తీర్ణులైన ప్రతీ విద్యార్థినీ 10వ తరగతిలో జాయిన్ అవ్వాలి



**ఏలూరు, జూన్, 13, (తెలుగు రాష్ట్రం విలేఖరి):** బాధిత మహిళల సహాయం కోసం ఏర్పాటుచేసిన వన్ స్టాప్ సెంటర్ కు సహాయం కోసం వచ్చిన మహిళలకు మెరుగైన సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో శుక్రవారం వన్ స్టాప్ సెంటర్ ద్వారా మహిళలు, బాలలకు అందుతున్న సహాయ కార్యక్రమాలపై కలెక్టర్ అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గృహ హింహ, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, తదితర బాధిత మహిళలకు ఆశ్రయం కల్పించి, వారి సమస్య పరిష్కారం అయ్యేంత వరకు సహాయం అందించడం వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది బాధ్యత అన్నారు. బాధిత మహిళలు, పిల్లలకు వారి సమస్యలను గుర్తించి, కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇవ్వడం, అవసరమైతే ఎఫ్.ఐ. ఆర్., నమోదు చేసి వారికి సత్వర న్యాయం అందించే దిశగా వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది కృషి చేయాలన్నారు. గృహ హింహ, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు సమస్య బాధితులు టోల్ ఫ్రీ 112 నెంబర్ కి గాని, 9550351100, 9491195221 నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని, బాధితులకు ఉపయోగపడేలా ఈ ఫోన్ నంబర్లను అన్ని ప్రధాన కూడళ్లలో ప్రదర్శించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, 9వ తరగతి ఉత్తీర్ణులైన ప్రతీ విద్యార్థినీ 10వ తరగతిలో చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా మహిళలు కుటుంబ తగాదాలతో ఇంటినుండి బయటకు వచ్చిన మహిళలు, ఇంటి సమస్యల కారణంగా పారిపోయి వచ్చిన బాలలకు కౌన్సలింగ్ ఇచ్చి వారి ఇంటికి పంపాలన్నారు. ఎటువంటి ఆధారం లేని మహిళలు, పిల్లలకు పునరావాస గృహాలకు తరలించాలన్నారు. బాధిత మహిళలు వారి కాళ్లపై వారు నిలబడేవిధంగా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఐసిడిఎస్ పిడి శారద, డి ఆర్ డి ఏ పీడీ విజయరాజు, వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ సిహెచ్. నిర్మల, ఎల్డిఎం నీలాద్రి, ప్రభృతులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ఈనెల 14న యోగాంధ్ర మాక్ డెమో.

## - వట్లూరు టిటిడిసిలో ఉదయం 7.00 గంటలకు యోగాంధ్ర మాక్ డెమో-జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.



**ఏలూరు, జూన్, 13, (తెలుగు రాష్ట్రం విలేఖరి):** ప్రజల్లో యోగా ప్రాముఖ్యతను పెంపొందించే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ఈనెల 14న యోగాంధ్ర మాక్ డెమో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఈనెల 14వ తేదీ శనివారం ఉదయం గ్రామ, వార్డు, సచివాలయాల పరిధిలో 6,197 వేదిక ల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి వేదిక యోగా మ్యాట్లు, త్రాగునీరు, తదితర ఏర్పాట్లు చేయాలని మండలస్థాయి అధికారులను ఆదేశించారు. మండలస్థాయి అధికారులందరూ ఈ కార్యక్రమంను పర్యవేక్షించి అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. స్థానిక పజలు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు చురుగ్గా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఇంతవరకు యోగా ఆంధ్ర కార్యక్రమం పాల్గొనేందుకు 8,46,428 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారువట్లూరు టిటిడిసిలో ఉదయం 7.00 గంటలకు యోగాంధ్ర మాక్ డెమో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు అంత ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

# మహిళలపై దాడులు అరికట్టాలి



**టీ. నర్సాపురం, జూన్ 13 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా మహాసభ ప్రజాసంఘాల కార్యాలయంలో శిరీష అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం టీ.నర్సాపురం మండల కమిటీ కార్యదర్శి మడకం కుమారి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని మహిళలపై దాడులను అరికట్టాలని అన్నారు. మండల మహాసభలో మండల కార్యదర్శిగా మడకం కుమారి, మండల అధ్యక్షురాలుగా పంచకర్ల నాగలక్ష్మి ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా మోండు శిరీష, పట్ల మంగకుమారి ఎన్నికయ్యారు. మహిళా సమస్యలపై, మండలంలో జరుగుతున్న దాడులపై నిరంతరం పని చేస్తామని వారు చెప్పారు.

# ఇది ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రభుత్వం

## -కౌన్సిలర్ వెంకటేష్ మహాలక్ష్మి



**కళ్యాణదుర్గం, జూన్ 13 తెలుగు రాష్ట్రం విలేఖరి):** కళ్యాణదుర్గం పట్టణంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల గర్ల్స్ హైస్కూల్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రులు భాగంగా విద్యార్థులకు బ్యాగులు పుస్తకాలు, షఉస్, బెల్ట్ పంపిణీ చేశారు. కౌన్సిలర్ వెంకటేష్ మహాలక్ష్మి టిడిపి నాయకులు రామన్న, నవీన్, రఘు, హెచ్ఎం వనజాక్షి, స్కూల్ కమిటీ చైర్మన్ రమేష్ తదితరులు పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎక్కడ నాణ్యతలో రాజీ పడకుండా కిట్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎక్కడ కూడా గతంలో లాగా దిష్టిబొమ్మ లెక్కన ఫోటోలు, పేర్లు లేవని కేవలం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర లోగో, రాష్ట్ర ప్రభుత్వం రాజముద్ర ఉంటుంది. ఎందుకంటే అది ప్రజలు ఆస్తి అని వారు తెలిపారు. గతంలో పబ్లిసిటీ పిచ్చితో మాజీ సీఎం జగన్ ఫోటో వేసుకొని బ్రష్టు పట్టించారని విమర్శించారు.

# ఎంపిడిఓగా సల్మాన్ రాజు



**దేవీపట్నం, జూన్ 13(తెలుగు రాష్ట్రం విలేకరి):** దేవీపట్నం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా యస్.సాల్మన్ రాజు భాధ్యతలను స్వీకరించారు. విజయనగరం జిల్లాలోని వివిధ మండలములలో 32 సంవత్సరములు సుదీర్ఘ సేవలు అందించి చివరిగా గుమ్మలక్ష్మీపురం మండలం నందు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేయుచూ అంతర్ జిల్లా బదిలీపై ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు కేటాయించబడగా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సూచనలతో దేవీపట్నం మండలములో నియమించబడినారు. ఈయన 1993 సంవత్సరములో గ్రూప్ %×××% సర్వీసు కమీషన్ ద్వారా ఎంపిక కాబడి, తదుపరి 2006 సం.లో విస్తరణ అధికారి ) పదోన్నతి పొంది తరువాతి కాలములో 2020 సం.లో మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పదోన్నతి పొందియున్నారు. ఈయన ఏజెన్సీ ప్రాంతమునకు చెందినవారని, ఈ ప్రాంతంలో పనిచేసే అవకాశం దొరకడం అదృష్టముగా భావిస్తున్నట్లుగా చెప్పారు. అందరు ప్రభుత్వ అధికారులను, ప్రజా ప్రజా ప్రతినిధులతోను, సామరస్యముగా ఉంటూ ప్రజాసమస్యల పట్ల వెంటనే స్పందిస్తూ త్వరితగతిన పరిష్కారము చేస్తూ పాత్రికేయులను, అందరినీ కలుపుకొని మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# ఏలూరులో విశిష్ట ఆభరణాల వేదిక వేగ జ్యుయలరీ శుభారంభం




**ఏలూరు, జూన్ 13,(తెలుగు రాష్ట్రం విలేకరి):** విశ్వసనీయతకు మరోపేరుగా నిలిచిన వేగ జ్యుయలర్స్ ఏలూరు పట్టణంలో తమ 5వ నూతన షోరూంను ఈరోజు ప్రారంభించారు. విశిష్ట అభరణాల వేదిక వేగ జ్యుయలర్స్ ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న ప్రముఖ సినీ నటుడు మరియు ప్రజాభిమాని నందమూరి బాలకృష్ణ నూతన షోరూంను తమ అమృత హస్తాలతో ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖ సినీనటి సంయుక్త మీనన్ పాల్గొని సందడి చేసారు. నూతన వేగ జ్యుయలరీ షోరూం లో అందంగా అమర్చిన వేలాది రకాల ఆభరణాలను కలయతిరిగి చూసారు. కొన్ని నగల విశిష్టతలను అడిగి తెలుసుకున్నారు. నూతన షోరూం ప్రారంభం సందర్భంగా వేగ జ్యుయలర్స్చైర్మన్ బండ్లమూడి రామోహన్మేనేజింగ్ డైరెక్టర్– వనమా నవీన్ కుమార్డైరెక్టర్లు – వనమా సుధాకర్, చంద్రకాంత్ మరియు చిట్లూరు నాగేశ్వరావుమాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలలో ప్రజలకు అద్భుతమైన వారు ఆశించిన డిజైన్ ఆభరణాలు అందించాలనే లక్ష్యంతోనే తమ షోరూం ఇంతకు ముందు కాకినాడలో ప్రారంభించామని ఇప్పుడు ఏలూరు ప్రారంభించటం తమకు ఎంతో సంతోషంగా ఉంది అన్నారు. ముఖ్యంగా శ్రీ బాలయ్య బాబు గారు ఎంతో బిజీగా ఉన్నా షోరూం ను ప్రారంభించుటకు రావటం అమితానందం కలిగించినది అన్నారు. వెలలేని వైభోగం తరుగులేని నమ్మకం మా అభిమతం అన్నారు. ఖాతాదారుల నమ్మకానికి కట్టుబడి నిబద్ధతతో మా షోరూమ్స్ సుస్థిరమైన వ్యాపారం సాగిస్తున్నాయని ఈ సందర్భంగా వారు తెలిపారు. నూతన షోరూం ప్రారంభం పురస్కరించుకుని అనేక ప్రత్యేక ఆఫర్లను ప్రవేశపెట్టామని, ప్రతి లక్ష రూపాయల కొనుగోలు పైన ఉచిత బంగారు నాణెం అందించటమే కాక, పాత బంగారం మార్పిడి పైన ప్రతి గ్రాముకు వంద రూపాయలు అదనంగా చెల్లించు ఏర్పాటు చేసామని వారు చెప్పారు. డైమండ్ (వజ్రాలు) ధర క్యారట్ ఒక్కంటికి రూ.51,999/- మాత్రమేనని ఈ సందర్భంగా వనమా బ్రదర్స్ తెలిపారు. అంతేకాక ఏలూరు షోరూం ప్రారంభం సందర్భంగా ఒక లక్కీ డ్రా ను నిర్వహించి అయిదుగురు లక్కీ డ్రా విజేతలకు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల విలువైన డైమండ్ నెక్లెస్ లను బహుమతిగా అందిస్తాము అన్నారు. ఈ ఆఫర్లు అన్ని తమ ఏలూరు షోరూం నకు మాత్రమే వర్తిస్తాయని, ఈ ఆఫర్లు 30 జూన్ 2025 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి అని వివరించారు. వేగ జ్యుయలర్స్ షోరూం నందు ప్రాచీనత నుండి ఆధునికత వరకు, సంప్రదాయ నగల నుండి ఫ్యాషన్ నగలు వరకు అన్ని రకాల ఆభరణాలు ఖతాదారుల అభిరుచి ప్రకారం అందుబాటులో ఉంటాయి. రాబోయే ఆషాడం మరియు శ్రావణ మాసములకు అవసరమైన అన్ని వేడుకల కోసం ప్రత్యేక నగలు ఈ షోరూం లో మీకోసం ఎదురు చూస్తున్నాయని, అందరు ఈ మంచి ఆఫర్ల సదవకాశం వినియోగించుకుని తమకు నచ్చిన నగలను కొనుగోలు చేయవలసిందిగా షోరూం యాజమాన్యం ఆహ్వానిస్తున్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# మార్గాని భరత్ చుట్టూ నేర చరిత్ర కలిగినవారే

## - ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై బురదజల్లే కుటిల రాజకీయాలు మానుకోవాలి -టీడీపీ, జనసేన నేతల హితవు




**రాజమహేంద్రవరం, జూన్13 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** నేరచరిత్ర కలిగిన వారు, అసాంఘిక కార్యకలాపాలు చేసేవారు మాజీ ఎంపీ మార్గాని భరత్ పక్కన ఉన్నారని టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు ఆరోపించారు. తన రాజకీయ స్వార్థం కోసం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పై భరత్ బురద చల్లుతున్నారని ఆయన మండిపడ్డారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో శుక్రవారం కూటమి నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మజ్జి రాంబాబు మాట్లాడుతూ ఇటీవల రాజమండ్రి సిటీలో మాజీ ఎంపీ, పారాచ్యూట్ లీడర్ భరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమం కార్యకర్తలు, నాయకులు లేక వెలవెలబోయి అట్టర్ ఫెయిల్యూర్ అయిందని దీంతో అధిష్టానం దొబ్బులు పెట్టడంతో బుర్ర పనిచేయక భరత్ మతి భ్రమించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఎ.కె.సి కళాశాల పక్కన హ్యాపీ స్ట్రీట్ నిర్వహించడం వల్ల స్థానిక ప్రజలు మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నామని చెప్పడంతో ఆ కార్యక్రమాన్ని హ్యాపీ సండే పేరుతో తమ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కోటిలింగాల ఘాట్ వద్దకు మార్చారని తెలిపారు. అక్కడ జరిగిన ప్రోగ్రాంలో వేదిక మీదకు భరత్ పక్కన ఉండే నేరచరిత్ర కలిగిన పీతా రామకృష్ణ ముఖ్య అనుచరులు ముగ్గురు ఎక్కి ప్రోగ్రాంను డిస్ట్రబ్ చేశారని అందుకు సాక్ష్యంగా పీతా రామకృష్ణ అనుచరులు చిందులు వేస్తున్న వీడియోను మజ్జి రాంబాబు మీడియాకు చూపించారు. ఆ ముగ్గురుపై ఒక మర్డర్ కేసులో ఎ1, ఎ2, ఎ3 గా పోలీసులు కేసు నమోదు చేశారని ఆయన చెప్పారు. వారిలో ఎ1 మీద 8పాత కేసులు,ఎ2 మీద 18 కేసులు, ఎ3 మీద 7 కేసులు ఉన్నాయని మజ్జి రాంబాబు పేర్కొన్నారు. వారంతా భరత్ ముఖ్య అనుచరుడిగా, వైసీపీ సిటీ యువజన విభాగం అధ్యక్షుడుగా ఉన్న పీతా రామకృష్ణ గ్యాంగ్ అని ఆయన చెప్పారు. భరత్ ఇప్పటికీ పీతా రామకృష్ణను పక్కన తిప్పుకుంటున్నాడని ఆయన అన్నారు. ఈ పీతా రామకృష్ణ వైసీపీకి చెందిన ఆర్యాపురం సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ గా చేసిన దుంగా మంగను ఫోనులో పొడిచేస్తానని బెదిరించడం, చందా సత్రం చైర్మన్ గా చేసిన రామశర్మను ఫోనులో ఎన్ని తిట్లు తిట్టాడు, ఎంత అసభ్య పదజాలంతో వారిని దూషించాడో అవన్నీ మజ్జి రాంబాబు మీడియాకు వినిపించారు. వైసీపీకి చెందిన మార్గాని సుశీలను వేధిస్తూ అసభ్య పోస్టులు పెడుతున్న చెల్లుబోయిన కృష్ణను భరత్ వెనకేసుకు వచ్చి అతడిపై కేసు ఉపసంహరించుకోవాలని మార్గాని సుశీలను ఒత్తిడి చేశాడని మజ్జి రాంబాబు చెప్పారు. మార్గాని సుశీల తనకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును ఆశ్రయిస్తే ఏపార్టీకి చెందినప్పటికీ మహిళను రక్షించడానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పోలీసులకు చెప్పి ఎఫ్ఐఆర్ నమోదు చేయించారని ఆయన తెలిపారు. ఇక హ్యాపీ స్ట్రీట్ లో ఉన్న షాపుల్లో మూడు వైసీపీ వారివేనని, వారిని కూడా భరత్ రోడ్డున పడేస్తున్నాడని ఆయన అన్నారు. ఎకెసి కళాశాల వద్ద భరత్ పెట్టిన కప్పు సాసర్ తొలగించి అక్కడ ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు. అక్కడి పార్కుకు ఎన్టీఆర్ పేరు పెట్టాలని కౌన్సిల్ తీర్మానం చేసిందని, గాల్లో గెలిచిన భరత్ కు కౌన్సిల్ తీర్మానం గురించి ఏమి తెలుస్తుందని మజ్జి రాంబాబు ఎద్దేవా చేశారు. జనసేన నాయకుడు జామి సత్యనారాయణ మాట్లాడుతూ మహిళను మోసం చేసిన పులపర్తి సత్యదేవ్ తొలుత జనసేనలో ఉండవాడని తర్వాత టీడీపీ లో చేరాడని, ఈ సంగతి తెలియడంతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సత్యదేవ్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని తెలిపారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు ఆసలు పరిచయంలేదని,15 మందితో కలిసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో కలిసి దిగిన ఫోటోలో సత్యదేవ్ ఉన్నాడని వైసీపీ మహిళా నాయకులు అతను ఆదిరెడ్డి వాసు అనుచరుడని చెప్పడం సమంజసం కాదని హితవు పలికారు. వాసిరెడ్డి బాబి మాట్లాడుతూ మాజీ ఎంపీ మార్గాని భరత్, వైసీపీ మహిళా నాయకులు తమ స్వార్థ రాజకీయాల కోసం ఒక ఆడ పిల్లను రోడ్డెక్కించారని మండిపడ్డారు. పులపర్తి సత్యదేవ్ తనతో ఉంటాడని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు అతనికి ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. నిందవేస్తే తనపై వేయాలని, సత్యదేవ్ తనతో ఉంటాడని ఆయన చెప్పారు. ఆడవారికి ఆడవాళ్ళే శత్రువులని వైసీపీ మహిళా నాయకులు రుజువు చేశారని, అన్యాయం జరిగిన ఆడపిల్లను మీడియా ముందుకు తీసుకు వచ్చి ఆమె భవిష్యత్తుతో ఆటలాడారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను రూ.7 లక్షలు ఇప్పిస్తానని సెంటిమెంట్ కు వెళ్ళినట్లు ఆ అమ్మాయితో భరత్ రాసిచ్చిన స్క్రిప్ట్ చదివించారని అది వాస్తవం కాదని వాసిరెడ్డి బాబి చెప్పారు. ఆ అమ్మాయి తర్వాత తమ ఇంటికి వచ్చి వైసీపీ వాళ్ళు తన చేత అలా చెప్పించారని బాధపడిందని ఆయన తెలిపారు. అయితే భరత్ వెంట తిరిగే పీతా రామకృష్ణ పులపర్తి సత్యదేవ్ ను ఒక అడ్వర్టైజ్మెంట్ ఆఫీసులో రెండు గంటలు కూర్చోపెట్టి వైసీపీలోచేరి మోరంపూడి సెంటర్ లో వైసీపీ జెండాలు కడితే కేసు మాఫీ చేయిస్తామని చెప్పాడని వాసిరెడ్డి బాబి తెలిపారు. సత్యదేవ్ పోలీసులకు లొంగిపోయి జైలుకు వెళితే ఆ అమ్మాయికి న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు.మహిళ జీవితం చిక్కిందిద్దాలికాని అల్లరి పాలు చేయకూడదని ఆయన హితవు పలికారు. నిన్న మీడియా సమావేశం నిర్వహించిన ఆ పదిమంది వైసీపీ మహిళా నాయకులు ఆ పిల్ల జీవితం నిలబెడతారా అని ఆయన నిలదీశారు. భరత్ తనకింద నలుపు పెట్టుకుని ఎదుటి వారిని విమర్శించకూడదని ఆయన అన్నారు. ఇప్పటికీ పీతా రామకృష్ణ భరత్ కు డ్రైవర్ గా ఉన్నాడని ఆయన చెప్పారు. భరత్ ఇకనైనా ఆడపిల్ల జీవితంతో రాజకీయం చేయకు అని వాసిరెడ్డి బాబి హితవు ప పలికారు. విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు దాస్యం ప్రసాద్, పోలాకి పరమేష్,షేక్ బషీర్, శనపతి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెస్తున్న లోకేష్

## -విద్యామిత్ర కిట్ల పంపిణీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



**రాజమహేంద్రవరం, జూన్ 13(తెలుగురాష్ట్రం ప్రతినిధి) :** ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే విధంగా విద్యావవ్యస్థలో సమూల మార్పులకు మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు (వాసు) చెప్పారు. సిటిలో అప్ గ్రేడ్ అయిన అన్నపూర్ణమ్మపేట సీనియర్ నేషనల్ బేసిక్ స్కూల్, వి ఎల్ పురం శ్యామలాంబ మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్, మోరంపూడి స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్ ను శుక్రవారం ఉదయం ఆయన పంపిణీ చేసారు. ఆయా పాఠశాలల్లో అప్ గ్రేడ్ చేసిన తరగతి గదులను ప్రారంభించి ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రయివేటు పాఠశాలల్లో సీట్లకు సిఫార్సు లేఖల కోసం తల్లిదండ్రులు వస్తూ ఉంటారని గుర్తుచేసారు. అయితే వచ్చే రెండు మూడేళ్ళలో ప్రభుత్వ పాఠశాలల్లో కూడా సీటు కోసం సిఫార్సు చేయమని తమ దగ్గరకు లేఖల కోసం వచ్చేలా విద్యావ్యవస్థలో మార్పులు రాబోతున్నాయని అన్నారు. ఆ దిశగా మంత్రి లోకేష్ మార్పులు తెస్తున్నారని ఆయన అన్నారు. గతంలో ఇచ్చిన విద్యాకిట్లకు ఇప్పటికీ ఎంతో తేడా ఉందని ఎమ్మెల్యే వాసు చెబుతూ, గతంలో జగనన్న బొమ్మలు ఉండేవని, ఇప్పుడు పాలకుల బొమ్మలు కాకుండా రాష్ట్రపతిగా చేసిన ఉపాధ్యాయుడైన డా సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతొ ఆయన బొమ్మ వేసి కిట్లు ఇప్పుడు ఇస్తున్నామని అన్నారు. గతంలో యూనిఫారంలు, బ్యాగులు ఏమాత్రం నాణ్యత లేకుండా ఉండేవని, ఇప్పుడు అత్యంత నాణ్యత గల బ్యాగులు, యూనిఫారంలు ఇస్తున్నామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఇక ఇప్పటివరకు పాఠశాల స్థాయిలోనే మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం ఉంటేనే బాగా చదువుతారని భావించి జూనియర్ కాలేజీల్లో కూడా మధ్యాహ్నం భోజన పథకం మంత్రి లోకేష్ ప్రవేశపెట్టినట్లు ఆయన చెప్పారు. గతంలో జగనన్న గోరుముద్ద వంటి పేర్లతో పథకాలు పెడితే, కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరుతొ మధ్యాహ్నం భోజన పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందని ఎమ్మెల్యే వాసు హర్షద్వానాల మధ్య చెప్పారు. డొక్కా సీతమ్మ ఓపిక ఉన్నంతకాలం ఎవరు ఆకలితో వచ్చిన లేదనకుండా కాదనకుండా కడుపునిండా భోజనం పెట్టి పంపించిన డొక్కా సీతమ్మ దాతృత్వాన్ని గుర్తించి ఆనాటి బ్రిటిష ప్రభుత్వం ప్రశంసించిందని అటువంటి మహనీయురాలి గురించి విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశ్యంతో ఈ పేరు పెట్టినట్లు ఆయన చెబుతూ ఇదీ కూటమి ప్రభుత్వ విశాలమైన ఆలోచనకు నిదర్శనమన్నారు. అలాగే సిటిలోని సీనియర్ నేషనల్ బేసిక్ స్కూల్, శ్యామలాంబ స్కూల్, మోరం పూడి స్కూల్స్ లో 8వ తరగతి వరకు మాత్రమే ఉండగా, తల్లిదండ్రుల విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకుని హైస్కూల్స్ గా మార్చాలని ప్రతిపాదన పంపిన వెంటనే ప్రభుత్వం ఆమోద ముద్ర వేసిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వివరించారు. ఇక ఇన్నాళ్లూ భయపడుతూ వస్తున్న బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ ల పని కూడా పడుతున్నామని, ఇప్పటికే చాలామందిని గుర్తించామని, ఇంకా ఎవరైనా ఉంటె తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు చేపడతామని, భయం లేకుండా స్వేచ్ఛగా జీవించే పరిస్థితులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆయన చెప్పారు. ఏవైనా తేడా వస్తే గతంలో ప్రశ్నించడానికి భయపడే పరిస్థితులు ఉండేవని ఇప్పుడు అలాంటిదేమీ ఉండదని, ఏ సమస్య వచ్చినా మీ శాసనసభ్యునిగా నేను ఉన్నానని అలాగే పైన ఒక పక్క ముఖ్యమంత్రి చందరాబు, మరోపక్క డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఇంకోపక్క మంత్రి లోకేష్ కూడా ప్రజల కోసమే అనుక్షణం ఆలోచిస్తూ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు మజ్జి రాంబాబు, మాలే విజయలక్ష్మి, చింతా జోగినాయుడు, పోలాకి పరమేష్, సనపతి సత్తిబాబు, కిలపర్తి నాగభూషణం, దాస్యం ప్రసాద్, బోను ఈశ్వరి, ఆడారి లక్ష్మీ నారాయణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

## -కలెక్టర్ వెట్రిసిల్వికి ఏపీడబ్ల్యూజేఎఫ్ వినతి



**ఏలూరు, జూన్ 23(తెలుగు రాష్ట్రం విలేఖరి):** జర్నలిస్ట్ ల పిల్లలకు ప్రవేటు పాఠశాలల్లో50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసిల్వి ని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు వైవి హరీష్, టి. వెంకట్రావు ఎస్ రుషిరావు, సిహెచ్ శ్రీనివాస్, పి.మిల్టన్ ప్రతాప్, దొరబాబు, చదలవాడ ప్రతాప్, కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో జర్నలిస్ట్ నాయకులు అభ్యర్థన పట్ల కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం డీఈవో వెంకట లక్ష్మమ్మ ని కూడా కలవమని కలెక్టర్ ఆదేశించడంతో డీఈవో ని కూడా కలిసి వర్కింగ్ జర్నలిస్ట్ ల పిల్లలకు ప్రవేటు పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరడం జరిగింది. ఈకార్యక్రమంలో జర్నలిస్ట్ లు ఏబీఎన్ వాసు, సతీష్, సన్నీ పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామికి నిత్య అన్నదాన వితరణ







**జగ్గయ్యపేట, జూన్ 13 (తెలుగురాష్ట్రం విలేకరి):** తిరుమలగిరి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానము నందు జరుగుచున్న నిత్య అన్నదాన పథకమునకు ఖమ్మం వాస్తవ్యులు గోనుగుంట్ల చైతన్య భార్గవ్, కావ్య రూ. 25,116, జగ్గయ్యపేట వాస్తవ్యులు రాటకొండ గోపాల్, చందన వారి కుమార్తె ఇషిత పేరున రూ. 10,116 విరాళంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కి అందజేశారు. వారికి శ్రీ స్వామివారి ప్రసాదములు, శేష వస్త్రములు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కె. రవీంద్ర భరద్వాజ్ సిబ్బంది పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నూతక్కి వెంకట సాంబశివరావు ఈ వివరాలు తెలిపారు.

# ఎమ్మెల్యే అమిలినేనికి గవర్నర్ అవార్డు

## - కుందుర్పి మండల టిడిపి అధ్యక్షులు ధనుంజయ





**కుందుర్పి, జూన్ 13(తెలుగురాష్ట్రం విలేకరి):** కళ్యాణదుర్గం శాసనసభ్యులు సురేంద్రబాబు రాష్ట్ర గవర్నర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోనున్నారు. 2024-2025 సంవత్సరాలలో ఒకరోజు బ్లడ్ క్యాంపు నిర్వహించి, ఎస్ ఆర్ ట్రస్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎక్కువ యూనిట్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రతిష్టాత్మక అవార్డుకు శాసనసభ్యులు ఎంపికయ్యారు. అవార్డును ఈనెల 14వ తేదీన గుంటూరు భారతీయ విద్యా భవన్ లో రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఎమ్మెల్యేకు అందిస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకి కుందుర్పి మండల టిడిపి అధ్యక్షులు జి. ధనంజయ శుభాకాంక్షలు తెలిపారు.

# యువతిని ప్రేమించి మోసం చేసిన వ్యవహారం

## -బొమ్మూరు పోలీసులు కేసు నమోదు



**రాజమహేంద్రవరం, జూన్ 13(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ప్రేమ పేరుతో ఒక యువతిని ప్రేమించి మోసం చేసిన వ్యవహారంపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఈస్ట్ జోన్ డిఎస్పి విద్య శుక్రవారం మీడియా సమావేశంలో వివరించారు. రూరల్ మండలం హుకుంపేట గ్రామపంచాయతీకి చెందిన సత్యవరపు కీర్తిని మోరంపూడికి చెందిన పులవర్తి సత్యదేవ్ ప్రేమిస్తున్నానని ఆమె వెంటపడి ఆమెను గర్భవతి చేసి, పెళ్లి చేసుకోమని అడగగానే ముఖం చాటేసాడని ఆమె తెలిపారు. తర్వాత ఒక హాస్పిటల్లో అబార్షన్ కూడా చేయించాడని, అయినప్పటికీ రాజకీయంగా పలుకుబడి తనకుందని తనని ఏం చేయలేరని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదురాలు ఫిర్యాదు చేసిందన్నారు. ఇరువురు యువతీ యువకులను, వారి బంధువులతో కౌన్సిలింగ్ జరిపామని ప్రయత్నాలు ఫలించలేదన్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు నిందితుడుపై కేసు నమోదు చేసినట్లు డిఎస్పి తెలిపారు. బాలికల, మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని ప్రత్యేకంగా శక్తి యాప్ను రూపొందించిందని ప్రతి మహిళ శక్తి యాప్ను డౌన్లోడ్ చేసుకొని ఆపద సమయంలో రక్షణ పొందవచ్చునని తెలిపారు. మహిళల సమస్యలతో రాజకీయాలు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో ఉమెన్ చైల్డ్ అడ్మిన్ సౌజన్య, బొమ్మూరు సిఐ కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్రా ట్రైల్ మాక్ డ్రిల్ కార్యక్రమం

## -జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు



**రాజమహేంద్రవరం, జూన్ 13(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్రా ట్రైల్ మాక్ డ్రిల్ కార్యక్రమం చేపట్టడం జరిగినదని, జూన్ 14 న పూర్తి స్థాయిలో మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ / నోడల్ అధికారి ఎస్. చిన్న రాముడు పేర్కొన్నారు. జూన్ 21 వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైల్ యోగా సాధన మాక్ డ్రిల్కు 1500 మందికి పైగా వైద్య ఆరోగ్య సిబ్బంది హాజరై విశేషం అని, జూన్ 14 , జూన్ 21 తేదీల్లో నిర్వహించే కార్యక్రమం లో మరింత మంది పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మార్గదర్శకతలో వివిధ ప్రభుత్వ శాఖల, వివిధ రంగాల వారితో యోగా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నట్లు జేసీ తెలిపారు. వైద్యులు, ఆశావర్కర్లు, ఏఎన్ఎమ్లు, అర్బన్ మెడికల్ ఆఫీసర్లు, అర్బన్ వైద్య ఆరోగ్య సిబ్బంది ఎమ్ఎల్హెచ్పీ లు, డీఎం%డ%హెచ్ఓ కార్యాలయ సిబ్బంది పెద్ద ఎత్తున ఈ సాధన కార్యక్రమం లో స్వచ్ఛందంగా పాల్గొనడం జరిగిందన్నారు. ఈ మాక్ డ్రిల్ కార్యక్రమం ద్వారా జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం ప్రజల్లో అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ రేపటి కార్యక్రమానికి ఎక్కువమంది పాల్గొని మరింత విజయవంతం చేయాలని కోరారు. జూన్ 14 రెండవ శనివారం ఉదయం 6 గంటలకు ఏకేసీ కాలేజ్, హ్యాపీ స్ట్రీట్ యోగాంధ్ర మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

## • టీమిండియాకు షాకింగ్ న్యూస్..

# ఇంగ్లాండ్ పర్యటన నుంచి భారత్‌కు తిరిగొచ్చిన హెడ్ కోచ్..?

**గంభీర్ కోచ్ అయిన తర్వాత, భారత జట్టు రెండోసారి స్వదేశానికి దూరంగా టెస్ట్ ఆడుతోంది. ఇంగ్లాండ్ పర్యటనలో ఐదు టెస్ట్‌లు ఆడాల్సి ఉంది. శుభ్‌మాన్ గిల్ టీమ్ ఇండియా కెప్టెన్ నాయకత్వంలో ముందుకు సాగనుంది. ఆర్ అశ్విన్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి స్టార్లు టెస్ట్‌ల నుంచి రిటైర్ అయిన సంగతి తెలిసిందే.**



భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కుటుంబ అత్యవసర పరిస్థితి కారణంగా ఇంగ్లాండ్ పర్యటనను మధ్యలోనే వదిలి స్వదేశానికి తిరిగి వచ్చారు. ఇంగ్లాండ్‌తో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు ముందు ఈ అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, గౌతమ్ గంభీర్ తల్లి గుండెపోటుకు గురయ్యారు. ప్రస్తుతం ఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో ఐసియులో చికిత్స పొందుతున్నారు. ఈ కారణంగానే గంభీర్ తన తల్లి వద్ద ఉండటానికి వెంటనే భారత్‌కు తిరిగి రావాల్సి వచ్చింది. జూన్ 20న ప్రారంభం కానున్న ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌కు భారత జట్టు సన్నాహాల్లో భాగంగా గంభీర్ గత వారం ఇంగ్లాండ్‌కు వెళ్లారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ ఆటగాళ్లు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన నేపథ్యంలో, యువ ఆటగాళ్లతో కూడిన జట్టుకు గంభీర్ మార్గదర్శకత్వం ఎంతో కీలకం. శుభ్మన్ గిల్ కెప్టెన్సీలో రానున్న ఈ సిరీస్ కొత్త శకానికి నాంది పలకనుంది. గంభీర్ తిరిగి ఇంగ్లాండ్‌కు తిరిగి వచ్చి సిరీస్‌కు అందుబాటులోకి వస్తారని భావిస్తున్నారు. ఈ కఠిన సమయంలో ఆయన తల్లి త్వరగా కోలుకోవాలని, గంభీర్ కుటుంబానికి ధైర్యం చేకూరాలని ఆశిస్తున్నాం. ఈ సంఘటన జట్టుపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి. అయితే, గంభీర్ లేకపోయినా, జట్టు తమ సన్నాహాలను కొనసాగిస్తోంది. ఈ రోజు బెకన్ హామ్‌లో నాలుగు రోజుల ఇంట్రా-స్క్వాడ్ మ్యాచ్‌లో భారత్ ఆడనుంది.


# మూడో రోజు ఆటకు వర్షం ఎఫెక్ట్..

## ఆస్ట్రేలియాకు బిగ్ షాక్ తగలనుందా?

**ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 ఫైనల్‌లో రెండవ రోజు ముగిసింది. మూడవ రోజు ఆట మరికొద్ది సేపట్లో ప్రారంభం కానుంది. ఆట రెండవ రోజున దక్షిణాఫ్రికా బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేయడం ద్వారా ఆస్ట్రేలియాపై ఒత్తిడి తెచ్చారు. అయితే, మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం కారణంగా, ఆస్ట్రేలియా జట్టు ప్రస్తుతం బలమైన స్థితిలో ఉంది. ఆట రెండవ రోజు భోజనం తర్వాత, వర్షం కారణంగా మ్యాచ్‌ను కొద్దిసేపు నిలిపివేయాల్సి వచ్చింది. అయితే, ఆటగాళ్లకు పెద్దగా ఇబ్బంది కలగలేదు. కానీ, ఆట మూడవ రోజు మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించగలదా? ప్రస్తుతం, వాతావరణ నివేదిక ప్రకారం, క్రికెట్ అభిమానులు కొంత ఇబ్బందిని ఎదుర్కొంటారు.**

### మూడవ రోజు వర్షం విలన్‌గా మారే అవకాశం?

అక్యూవెదర్ నివేదిక ప్రకారం, ఉదయం వాతావరణం చాలా వేడిగా ఉంటుంది. పగటిపూట మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత 29 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవచ్చు. 91% మేఘావృతం ఉండవచ్చు. సాయంత్రం నాటికి వాతావరణంలో మార్పు కనిపిస్తుంది. 97% మేఘావృతం ఉంటుందని భావిస్తున్నారు. అంటే, సాయంత్రం వర్షం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం, రెండు జట్ల ఆటగాళ్లు మూడవ రోజు వర్షం పడకూడదని, ఈ మ్యాచ్ పూర్తి అవ్వాలని కోరుకుంటున్నారు.




### ఆట రెండవ రోజు ఎలా ఉందంటే..

ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా తన తొలి ఇన్నింగ్స్‌లో అన్ని వికెట్లు కోల్పోయి 212 పరుగులు చేసింది. దీనికి ప్రతిస్పందనగా దక్షిణాఫ్రికా జట్టు 138 పరుగులకు ఆలౌట్ అయింది. రెండవ రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 8 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. మిచెల్ స్టార్క్, నాథన్ లియాన్ క్రీజులో ఉన్నారు. మిచెల్ స్టార్క్ 16లి పరుగులు చేయగా, నాథన్ లియాన్ 1లి పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నాడు. అంతకుముందు, ఆస్ట్రేలియా తరపున వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ అలెక్స్ కారీ రెండవ ఇన్నింగ్స్‌లో 43 పరుగులు చేశాడు. అతనితో పాటు, మార్నస్ లాబుస్చాగ్నే 22 పరుగులు అందించగా, స్టీవ్ స్మిత్ 13 పరుగులు చేసి ఔటయ్యాడు.

ఆస్ట్రేలియా జట్టుకు అత్యంత దారుణమైన విషయం ఏమిటంటే, ఈ ఇన్నింగ్స్‌లో ఏ ఆటగాడూ పెద్దగా స్కోరు చేయలేకపోయాడు. అయితే, దక్షిణాఫ్రికాపై ఆస్ట్రేలియా ఇప్పటివరకు 218 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఇప్పటివరకు, దక్షిణాఫ్రికా నుంచి కగిసో రబాడ, లుంగి న్గిడి తలో 3 వికెట్లు పడగొట్టారు. మార్కో జాన్సెన్, వియాన్ ముల్డర్ తలో వికెట్ పడగొట్టారు.

# క్రికెట్ మక్కాలో కొత్త చరిత్ర సృష్టించిన కమిన్స్!

## 148 ఏళ్ల టెస్ట్ హిస్టరీలో తొలిసారి..

**లార్డ్స్‌లో జరుగుతున్న వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 138 పరుగులకే ఆలౌట్ అయింది. ఆస్ట్రేలియన్ కెప్టెన్ పాట్ కమిన్స్ దెబ్బకు సౌతాఫ్రికా బ్యాటర్లు విలవిల్లాడిపోయారు. కమిన్స్ ఏకంగా 6 వికెట్లు పడగొట్టి కొత్త చరిత్ర లిఖించాడు.**

148 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో మరెవరూ సాధించలేని రికార్డును కమిన్స్ నెలకొల్పాడు. మొదటి రోజు వియాన్ ముల్డర్ వికెట్ తీసిన పాట్ కమిన్స్, రెండవ రోజు మొదటి సెషన్‌లో దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బావుమా వికెట్ తీయడం ద్వారా తన వికెట్ల పంట పండించాడు.

రెండవ సెషన్‌లో కమిన్స్ ఒకే ఓవర్‌లో కైల్ వెర్రెన్, మార్కో జాన్సెన్‌లను పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత 45 పరుగులు చేసిన వియాన్ ముల్డర్‌ను అవుట్ చేసి 5 వికెట్ల హాల్ సాధించాడు. ఇది అతని కెరీర్‌లో ఒక ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీయడం 14వ సారి. చివరికి కమిన్స్ ఇన్నింగ్స్ చివరి వికెట్ తీయడం ద్వారా మరో చరిత్ర సృష్టించాడు.

కమిన్స్ తన ఆరో వికెట్‌గా చివర్లో కగిసో రబాడను అవుట్ చేశాడు. దీనితో అతను 68 టెస్ట్ మ్యాచ్‌లలో 126 ఇన్నింగ్స్‌లలో 300 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. కమ్మిన్స్ తొలి ఇన్నింగ్స్‌లో 18.1 ఓవర్లు బౌలింగ్ చేసి, కేవలం 28 పరుగులకు 6 వికెట్లు పడగొట్టాడు. 148 సంవత్సరాల టెస్ట్ క్రికెట్ చరిత్రలో ముఖ్యంగా లార్డ్స్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీసిన తొలి విదేశీ కెప్టెన్‌గా నిలిచాడు. గతంలో లార్డ్స్‌లో విదేశీ కెప్టెన్ చేసిన అత్యుత్తమ ప్రదర్శన రికార్డు న్యూజిలాండ్ స్పిన్నర్ డేనియల్ వెట్టోరి పేరిట ఉండేది. అతను 69 పరుగులకు 5 వికెట్లు పడగొట్టాడు. ఇది మాత్రమే కాదు, లార్డ్స్‌లో ఏ కెప్టెన్ చేసిన అత్యుత్తమ ప్రదర్శన రికార్డు కూడా ఇది. వెట్టోరి ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ బాబ్ విల్లీస్ రికార్డును బద్దలు కొట్టాడు. 1992లో భారత్‌పై జరిగిన ఇన్నింగ్స్‌లో విల్లీస్ 101 పరుగులకు 6 వికెట్లు పడగొట్టాడు.




# టీ20 ప్రపంచకప్-2026 టార్గెట్‌గా.. న్యూజిలాండ్‌తో టీమిండియా సిరీస్..



**2026 టీ20 ప్రపంచ కప్ కోసం ఇప్పటికే ప్రణాళికలు మొదలయ్యాయి. ఎందుకంటే ఈ టోర్నమెంట్ కు కేవలం ఏడు నెలల సమయం మాత్రమే మిగిలి ఉంది. దీంతో వరుసగా రెండో సారి పొట్టి ప్రపంచకప్ ను గెల్చుకోవడమే లక్ష్యంగా టీమిండియా ప్రణాళికలు రచిస్తోంది.**

ఐసీసీ టి20 ప్రపంచ కప్ వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరుగుతుంది. ఈ టోర్నమెంట్ కు భారతదేశంతో పాటు శ్రీలంక దేశాలు ఆతిథ్యం ఇస్తున్నాయి. కాబట్టి భారత జట్టు వరుసగా రెండవ టైటిల్ గెల్చుకునేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని క్రికెట్ అభిమానులు భావిస్తున్నారు. 2024లో వెస్టిండీస్, అమెరికాలో జరిగిన టీ20 ప్రపంచ కప్ ను టీమిండియా గెల్చుకుంది. ఇప్పుడు 2026 టి20 ప్రపంచ కప్ లోనూ అలాగే విజయకేతనం ఎగరవేయాలని భారత జట్టు భావిస్తోంది. ఈ మెగా క్రికెట్ టోర్నమెంట్ కోసం టీమిండియా ప్రత్యేక ప్రణాళికలు రచిస్తోంది. టీ20 ప్రపంచ కప్ కు ముందు టీం ఇండియా వైట్ బాల్ సిరీస్ ఆడనుంది. ఇందుకోసం న్యూజిలాండ్ జట్టు భారత పర్యటనకు రానుంది. ఈ సిరీస్ జనవరి 11 నుంచి జనవరి 30 మధ్య జరుగుతుంది. టూర్ లో భాగంగా ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్ ల జరగనున్నాయి. టీ20 ప్రపంచ కప్ నకు ముందు ఈ సిరీస్ చాలా ప్రయోజనకరంగా ఉంటుందని టీమిండియా భావిస్తోంది.

T20 ప్రపంచ కప్ 2026 ఫిబ్రవరి 8, 2026 నుంచి మార్చి 8, 2026 వరకు జరుగుతుంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 20 జట్లు పాల్గొంటాయి. ఈ టోర్నమెంట్‌కు ముందు పటిష్టమైన న్యూజిలాండ్ జట్టుతో ఆడడం భారత జట్టుకు లాభిస్తుంది. ఈ సిరీస్ తర్వాత భారత జట్టు ఆటగాళ్ళు నేరుగా T20 ప్రపంచ కప్ లోకి ఆడనున్నారు. ప్రస్తుతం, భారత T20 జట్టుకు సూర్యకుమార్ యాదవ్ నాయకత్వం వహిస్తున్నారు. సూర్యకుమార్ యాదవ్ IPL 2025 టోర్నమెంట్‌లో అద్భుతంగా రాణించాడు. కాబట్టి అతని నాయకత్వంలో వరుసగా రెండవసారి టైటిల్ గెలుచుకునే అవకాశం ఉంటుంది. మొదటిసారి, 20 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటాయి. మొత్తం 55 మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది. ఈసారి టీ20 ప్రపంచకప్ పోరు మరింత రసవత్తరంగా సాగనుందని తెలుస్తోంది.

IPL 2025 టోర్నమెంట్‌లో చాలా మంది యువ ఆటగాళ్లు మంచి ప్రదర్శన ఇచ్చారు. ఇందులో చాలా మందికి T20 ప్రపంచ కప్ 2026 టోర్నమెంట్‌లో అవకాశం లభించవచ్చు.

# కుప్పకూలిన సౌతాఫ్రికా!

## ఇక ఆసీస్‌కు రెండో గద లాంఛనమేనా?



**లార్డ్స్ వేదికగా జరుగుతున్న WTC ఫైనల్‌లో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 138 పరుగులకే ఆలౌట్ అయింది. ఆస్ట్రేలియా 212 పరుగులు చేసింది. ప్యాట్ కమిన్స్ 6 వికెట్లు తీసుకున్నాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో రబాడా 5 వికెట్లు తీశాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియాకు 74 పరుగుల ఆధిక్యం ఉంది.**

ఇంగ్లండ్‌లోని క్రికెట్ మక్కాగా పిలిచే లార్డ్స్ వేదికగా జరుగుతున్న వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో కుప్పకూలింది. బుధవారం మొదలైన ఫైనల్‌లో టాస్ గెలిచిన సౌతాఫ్రికా కెప్టెన్ టెంబ బవుమా తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. ఆస్ట్రేలియాను ఫస్ట్ ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు ఆహ్వానించి.. వాళ్లను కేవలం 212 పరుగులకే ఆలౌట్ చేసిన సౌతాఫ్రికా మంచి స్టార్ట్ అందుకుందని అంతా అనుకున్నారు. ప్రొటీస్ బౌలర్ కగిసో రబడా ఐదు వికెట్ల హాల్‌తో చెలరేగాడు. కానీ, బౌలర్ల కష్టానికి సౌతాఫ్రికా బ్యాటర్లు సరైన ఫలితం ఇవ్వలేకపోయారు. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 138 పరుగులకే ఆలౌట్ అయ్యారు. ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఏకంగా 6 వికెట్లతో రెచ్చిపోయాడు. మిచెల్ స్టార్క్ 2, జోష్ హెజల్‌వుడ్ ఒక వికెట్ తీసుకున్నారు.


ఇక సౌతాఫ్రికా బ్యాటర్లలో డేవిడ్ బెడింగ్‌హామ్ 111 బంతుల్లో 6 ఫోర్లతో 45 పరుగులు, కెప్టెన్ బవుమా 84 బంతుల్లో 4 ఫోర్లతో 36 పరుగులతో రాణించారు. వీళ్లిద్దరు మినహా మరే బ్యాటర్ కూడా ఆసీస్ బౌలర్ల ధాటికి ఎదురొడ్డి నిల్చోలేకపోయారు. ఆట రెండో రోజు రెండో సెషన్‌లోనే రెండు జట్ల తొలి ఇన్నింగ్స్‌లు ముగిశాయి. ప్రస్తుతం ఆస్ట్రేలియాకు 74 పరుగుల లీడ్ దక్కింది. మరి రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా మంచి బ్యాటింగ్ చేస్తే.. మ్యాచ్ వారి వైపే వెళ్లే అవకాశం ఉంది. దీంతో ఇక ఆస్ట్రేలియాకు రెండో డబ్ల్యూటీసీ టైటిల్ ఖాయం అని క్రికెట్ నిపుణులు అంటున్నారు. అలా కాకుండా సౌతాఫ్రికా బౌలర్లు రెచ్చిపోయి.. ఆస్ట్రేలియాను అతి తక్కువ స్కోర్‌కు ఆలౌట్ చేస్తే వారికి గెలిచే అవకాశం ఉంది. దాదాపు మూడో రోజు లేదా నాలుగో రోజు లంచ్ బ్రేక్ సమయానికి విజేత ఎవరో తేలే అవకాశం ఉంది.

తెలుగురాష్ట్రం దినపత్రిక




# దటీజ్ అనుష్క అనిపించిందిగా!

స్వీటీ అనుష్క 'బాహుబలి' తరువాత సెలెక్టీవ్‌గా సినిమాలు చేస్తూ వస్తోంది. తన ఇమేజ్‌కు తగ్గ సినిమాలని ఎంచుకుంటూ వరుసగా లేడీ ఓరియెంటెడ్ సినిమాలకే ప్రధాన్యత నిస్తూ వస్తోంది. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' తరువాత అనుష్క నటించిన లేడీ ఓరియెంటెడ్ ఫిల్మ్ 'ఘాటి'. క్రిష్ జాగర్లమూడి డైరెక్ట్ చేసిన ఈ సినిమా షఉటింగ్ పూర్తయింది. జూలై 11న భారీ స్థాయిలో పాన్ ఇండియా సినిమాగా రిలీజ్‌కు రెడీ అవుతోంది. ప్రస్తుతం ఈ దీనికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చివరి దశకు చేరుకుంది.సినిమా రిలీజ్‌కు సరిగ్గా నెల రోజులు టైమ్ ఉండటంతో టీమ్ త్వరలో ప్రమోషన్స్‌ని ప్రారంభించాలని ప్లాన్ చేస్తోంది. వరుసగా లిరికల్ ఆడియోలని రిలీజ్ చేస్తూ ప్రమోషన్స్‌ని ఓ రేంజ్‌లో చేయబోతున్నారు. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. గంజాయి స్మగ్లింగ్ నేపథ్యంలో సాగే ఈ మూవీలో అనుష్క పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించనుందని గ్లింప్స్ ఇప్పటికే స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే సినిమా రిలీజ్ దగ్గరపడుతున్ననేపథ్యంలో ఈ సినిమాకు భారీ డిమాండ్ ఏర్పడినట్టుగా తెలుస్తోంది.గ్లింప్స్ ఆకట్టుకోవడం, అనుష్క మరో సారి శివాలెత్తే క్యారెక్టర్‌లో కనిపించనుండటంతో 'ఘాటి'కి సంబంధించిన నాన్ థియేట్రికల్ బిజినెస్‌కు భారీ క్రేజ్ ఏర్పడింది. క్రిష్ మరోసారి అనుష్కతో కలిసి చేసిన సినిమా కావడంతో ఈ సినిమా నాన్ థియేట్రికల్ రైట్స్ రికార్డు స్థాయిలో రూ.36 కోట్లకు అమ్ముడు పోయినట్టుగా తెలిసింది. లేడీ ఓరియెంటెడ్ మూవీకి ఈ ప్రైజ్ దక్కడం ఓ రికార్డ్‌గా చెబుతున్నారు. ఈ డీల్‌తో మేకర్స్ పెట్టిన ఇన్వెస్ట్ మెంట్ దాదాపు వచ్చేసిందని, ఇక మిగతా వచ్చేది అదనంగా మారి లాభాలని అందిస్తుందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి.ఈ సినిమా మొత్తం బడ్జెట్ రూ.45 కోట్లు. నాన్ థియేట్రికల్ బిజినెస్ పరంగా రూ.36 కోట్లని రాబట్టింది. అంటే పెట్టుబడిలో 90 శాతం రికవరీ అయినట్టే. ఇక థియేట్రికల్ బిజినెస్ పూర్తయితే %-%ఘాటి%-% రిలీజ్‌కు ముందే లాభాల్లోకి వెళుతుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ థియేట్రికల్ బిజినెస్‌ని క్లోజ్ చేయబోతున్నారట. ఈ మూవీలోని కీలక పాత్రల్లో తమిళ నటుడు విక్రమ్ ప్రభు, రమ్యకృష్ణ, జగపతిబాబు నటించారు. విద్యాసాగర్ సంగీతం అందించగా ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వై. రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. త్వరలో ప్రారంభం కానున్న ప్రమోషన్స్‌లో అనుష్క పాల్గొనబోతోంది.




# ఆల్ఫా సర్ ప్రైజ్ కోసం

## అలియా ఫుల్ హార్డ్ వర్క్.. బ్లాక్ బస్టరేనా?



బాలీవుడ్ భామలు ఆలియా భట్, శార్వరీ వాఘ్.. లీడ్ రోల్స్ లో ఆల్ఫా మూవీ చేస్తున్న విషయం తెలిసిందే.బాలీవుడ్ భామలు ఆలియా భట్, శార్వరీ వాఘ్.. లీడ్ రోల్స్ లో ఆల్ఫా మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. శివ్ రావేల్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను బాలీవుడ్ అగ్ర నిర్మాణసంస్థ యశ్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. అయితే ఆ సంస్థకు చెందిన స్పై యూనివర్స్‌లో రాబోతున్న మొదటి మహిళా స్పై మూవీ కావడంతో భారీ అంచనాలున్నాయి.అనిల్ కపూర్, బాబీదేవోల్ కీలక పాత్రల్లో నటిస్తుండగా.. హృతిక్ రోషన్ క్యామియో రోల్ లో కనిపించనున్నారు. అయితే ఆల్ఫా మూవీలో నెవ్వర్ బిఫోర్ అనేలా యాక్షన్ సీన్స్ ఉండనున్నట్లు ఇప్పటికే టాక్ వినిపించింది. హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ సమక్షంలో యుద్ధపోరాట సన్నివేశాలను తీస్తున్నట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది.అదే సమయంలో ఇప్పుడు మరో వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆల్ఫా మూవీలో స్పెషల్ సాంగ్ ఉన్నట్లు తెలుస్తోంది. హై- ఆక్టేన్, గ్లామరస్ ఎక్స్ ట్రా వాగాన్ గా సాంగ్ ఉండనున్నట్లు సమాచారం. ఆ పాటలో ఆలియా భట్, శార్వరీ వాఘ్ కనిపించనున్నారట. వారిద్దరూ సాంగ్ లో ముందెన్నడూ చూడని అవతార్ లో కనిపిస్తారని టాక్.ఇప్పటికే సాంగ్ కోసం స్టూడియోలో ప్రాక్టీస్ చేస్తున్నారని తెలుస్తోంది. గంటల తరబడి రిహార్సల్స్ లో నిమగ్నమై ఉన్నారని సమాచారం. సినిమా కోసం హార్డ్ వర్క్ చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. సాంగ్ అదిరిపోయేలా ఉండేందుకు కష్టపడుతున్నారని వినికిడి. సాంగ్ కోసం జిమ్ సెషన్స్ కు వెళ్తున్నారని టాక్ వినిపిస్తోంది.భారీ బడ్జెట్ తో సాంగ్ రూపొందుతోందని ఇండస్ట్రీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకు తగ్గట్లే బ్యూటీలు సిద్ధమవుతున్నారని టాక్ వస్తోంది. ఏదేమైనా ఇప్పుడు ఆ సాంగ్ విషయం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఉన్న అప్డేట్ ప్రకారం.. సాంగ్ బ్లాక్ బస్టర్ హిట్ అవ్వడం ఖాయమనేలా అనిపిస్తుందని నెటిజన్లు అంటున్నారు."సాంగ్ గురించి ఆలియా, శార్వరి ఇద్దరూ ఉత్సాహంగా ఉన్నారు. ఉత్కంఠభరితంగా సాంగ్ ఉండనుంది. యాక్షన్ ప్యాక్డ్ మూవీలో ఇద్దరు ఫిమేల్ లీడ్ రోల్స్ తో స్పెషల్ సాంగ్ అంటే అర్థం చేసుకోవచ్చు. దృశ్యపరంగా అద్భుతమైన, హై ఎనర్జీతో పాట ఉండనుంది. వేరే లెవెల్ లో రూపుదిద్దుకుంటుంది" అని సినీ వర్గాలు తెలిపాయి. మరి ఆలియా, శార్వరి సాంగ్ ఎలా ఉంటుందో చూడాలి.

# అల్లుడి నిర్మాణంలో మావయ్య మూవీ.. నిజమేనా?



అయితే చిరు హీరోగా అల్లు అర్జున్ నిర్మాతగా తెరకెక్కే సినిమా కోసం రంగం సిద్ధమవుతున్నట్లు ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి.అల్లుడి నిర్మాణంలో మావయ్య మూవీ.. ఇప్పుడు టాలీవుడ్ సినీ వర్గాల్లో ఇదే హాట్ టాపిక్ గా మారింది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సినిమాను రూపొందించనున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. రీసెంట్ గా పవన్ నిర్మాణంలో చరణ్ మూవీ ఉంటుందని టాక్ రాగా.. ఇప్పుడు చిరు- బన్నీ ప్రాజెక్ట్ కోసం వార్తలు వినిపిస్తున్నాయి.అయితే చిరు హీరోగా అల్లు అర్జున్ నిర్మాతగా తెరకెక్కే సినిమా కోసం రంగం సిద్ధమవుతున్నట్లు ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. గీతా ఆర్ట్స్ బ్యానర్ పై ఆ మూవీ రూపొందుతుందని టాక్ వినిపిస్తోంది. కోలీవుడ్ కు చెందిన ఓ ప్రముఖ డైరెక్టర్.. మెగాస్టార్- ఐకాన్ స్టార్ ప్రాజెక్ట్ కు దర్శకత్వం వహించనున్నారని ఇప్పుడు ప్రచారం జరుగుతోంది.ఆ దర్శకుడు ఎవరో తెలియక పోయినా.. మూవీ మాత్రం యాక్షన్ డ్రామా జోనర్ లో తెరకెక్కుతుందని తెలుస్తోంది. చిరంజీవి ఇమేజ్ కు తగ్గట్టుగా సామాజిక సందేశంతో కూడిన స్టోరీతో సినిమా రూపొందనుందని సమాచారం. గీతా ఆర్ట్స్ బ్యానర్ పై అల్లు అర్జున్ నిర్మాతగా డెబ్యూ మూవీ ఇదే కావడంతో ఇప్పుడు ఆ విషయం హాట్ టాపిక్ గా మారింది.ఇందులో నిజమెంతో తెలియదు కానీ.. సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. నెటిజన్లు, సినీ ప్రియులు, అభిమానులు రెస్పాండ్ అవుతున్నారు. నెవ్వర్ బిఫోర్ కాంబినేషన్ అని చెబుతున్నారు. అనుకున్నట్లు ప్రాజెక్ట్ ఓకే అయితే.. ఫ్యాన్స్ కు పండగేనని కామెంట్లు పెడుతున్నారు. దానిపై చిరు టీమ్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.ఇక చిరంజీవి, అల్లు అర్జున్ సినిమాల విషయానికొస్తే.. ఇప్పుడు ఇద్దరూ తమ సినిమాలతో బిజీగా ఉన్నారు. సోషియో ఫాంటసీ జోనర్ లో రూపొందుతున్న విశ్వంభర మూవీని ఇప్పటికే కంప్లీట్ చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతుండగా.. త్వరలోనే సినిమా రిలీజ్ కానుంది. ఇప్పుడు ఆయన అనిల్ రావిపూడితో వర్క్ చేస్తున్నారు.ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా రూపొందనున్న ఆ సినిమా షఉటింగ్.. ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. వచ్చే సంక్రాంతికి మూవీ రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. మరోవైపు, పుష్ప-2తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న అల్లు అర్జున్.. ఇప్పుడు కోలీవుడ్ డైరెక్టర్ అట్లీతో వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతుండగా.. త్వరలో షఉటింగ్ ప్రారంభం కానుంది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339